నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**



నిక్షిప్తమైన శక్తిని
దక్షతతో వెలికితీసి ధర్మపథములో
శిక్షణ తోడుత వాడిన
"రక్షణ రంగమున స్వావలంబన" గలుగున్ !!

(రక్షణ రంగంలో స్వావలంబన కొరకై రాజ్ నాథ్ సింగ్ పిలుపు నిచ్చారు)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**చురక**

కులం పేర నేతలెదిగి
కులంకేమి చేస్తుంర్రు
అధికారం పొందినంకా
అభివృద్ధి మరుస్తుంర్రు.
ఏపార్టీలో ఎన్నికైనా
ఏదున్నది స్వంత రీతి
విశ్వసించి నడవాలిక
వ్యవస్థీకృత రాజనీతి



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ ఆదివారం 5-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:49 పేజీలు:6 వెల: రూ.1/-


# నాటి ఆర్జేడీ ఆటవిక పాలనవల్లే నేటికీ బీహారీల వలసలు : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 4: బీహార్ లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలైన ఆర్జేడీ , జేడీయూ , కాంగ్రెస్ , బీజేపీ నేతలు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇవాళ ప్రధాని నరేంద్రమోదీ బీహార్ రాజధాని పట్నా లో స్కిల్స్, ఎడ్యుకేషన్‌కు సంబంధించి రూ.62 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆర్జేడీపైన, కాంగ్రెస్ పార్టీపైన ప్రధాని విమర్శలు గుప్పించారు. ఆర్జేడీ ఆటవిక పాలన కారణంగా బీహార్ యువత వలసలు వెళ్లాల్సి వస్తోందని ప్రధాని విమర్శించారు. ఆర్జేడీ హయాంలో విద్యావ్యవస్థ నిరాధరణకు గురైందన్నారు. పిల్లలకు సరైన విద్యావశాలు దొరకలేదని ఆరోపించారు. అభివృద్ధి లేకపోవడంతో పేదరికంలో ఉన్న పేరెంట్స్ పిల్లలను బడులకు బదులుగా పనులకు పంపారని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ బీహార్ కోసం చేసిందేమీ లేదని ప్రధాని విమర్శించారు. ఓ కాంగ్రెస్ నాయకుడు ఎన్నికలు ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయి అసత్యాలు ప్రచారం చేస్తుంటాడని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు బీహార్‌ను ఎంతో అభివృద్ధి చేసిందని ప్రశంసించారు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ నాయకుడి అబద్ధపు ప్రచారాలను బీహారీలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు.

# మాట్లాడటానికి ఇంకేం లేదు.. మావోయిస్టులు లొంగిపోవాల్సిందే : అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: కేంద్రం ప్రభుత్వ ఒత్తిడి నేపథ్యంలో ఆయుధాలు వదిలేసి చర్చలకు వచ్చే విషయంలో మావోయిస్టుల లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరపదని, వాళ్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాల్సిందేనని వ్యాఖ్యానించారు.

లొంగిపోయేందుకు మావోయిస్టులు ముందుకు వస్తే తాము స్వాగతిస్తామని హోంమంత్రి అన్నారు. లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని, పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన హోంమంత్రి.. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని చెప్పారు. తమతో చర్చలు జరపాలని మావోయిస్టులు ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని హోంమంత్రి వ్యాఖ్యానించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతాదళాలు తగిన సమాధానం ఇస్తాయని ఆయన హెచ్చరించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయం: మంత్రి ప్రభాకర్



హైదరాబాద్, అక్టోబర్ 4:జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇవాళ(శనివారం) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రూ.2.16 లక్షలతో సీసీ రోడ్లకు, కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన చేశామని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్.

రూ.54 లక్షలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. దీని పక్కన ఉన్న స్థలంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రేపటి నుంచి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. వాకింగ్ ట్రాక్, పిల్లల గేమ్స్ ఆడుకోవడానికి, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్.

హైదరాబాద్‌లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని గుర్తుచేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు అడగాలని చూస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మాత్రమే ప్రజలు పట్టం కడతారని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్‌ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్నారని నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఉక్రెయిన్‌లో ప్రయాణికుల రైలుపై రష్యా డ్రోన్ దాడి.. 30 మందికి గాయాలు

కీవ్, అక్టోబర్ 4: ఉక్రెయిన్-రష్యా యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతోంది. తాజాగా ఉక్రెయిన్ లోని ఉత్తర సమీ ప్రాంతంలో రష్యా దళాలు డ్రోన్లతో విరుచుకుపడ్డాయి.

ప్రయాణికుల రైలుపై బాంబులు పడటంతో పలు బోగాలు మంటల్లో కాలిపోగా, సుమారు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. దీంతో హుటాహుటిన రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ రష్యా చర్యపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.'సమీ ప్రాంతంలోని రైల్వేస్టేషన్‌పై రష్యా క్రూరమైన డ్రోన్ దాడి జరిపింది. అత్యవసర సర్వీసులన్నీ ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారి సమాచారం తెలుసుకుంటున్నాం. ఇంతవరకూ 30 మంది గాయపడినట్టు సమాచారం అందింది' అని ఆ ట్వీట్‌లో జెలెన్స్కీ పేర్కొన్నారు. సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేస్తోందని, ప్రతి రోజూ రష్యా ఎంతో మంది ప్రాణాలు తీస్తోందని జెలెన్స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా ఉన్మాద చర్య పట్ల ప్రపంచం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించరాదని, యుద్ధ పరిష్కారం కోసం ఐరోపా, అమెరికా నుంచి ఎన్నో ప్రకటనలు వింటున్నప్పటికీ మాట సాయం సరిపోదని అన్నారు. బలమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు. కాగా, రీజినల్ గవర్నల్ ఒలేహ్ హ్రిహోరోవ్ ప్రయాణికుల రైలుపై రష్యా దాడి ఘటనను ధ్రువీకరించారు. వైద్యులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలి వద్ద సహాయక చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. డ్రోన్ దాడిలో కాలిపోతున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆరెంపుల యువతి పల్లవి అవార్డు స్వీకరణ

ఖమ్మం రూరల్, అక్టోబర్ 04 : ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఆరెంపులకు చెందిన యువతి తాళ్లూరి పల్లవి శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రొగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆమె ఈ అవార్డును అందుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధానమంత్రి సేతు పథకాన్ని రూ.60 వేల కోట్లతో ప్రారంభించారు. దీనిలో భాగంగానే అత్యుత్తమ



నైపుణ్యం కనపరిచిన పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. దీనిలో భాగంగానే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్‌గా ఎన్నికైన తాళ్లూరి పల్లవికి ప్రదాని అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పల్లవి తల్లిదండ్రులు తాళ్లూరి రవి, అజిత ఆనందం వ్యక్తం చేశారు.

# అల్వాల్‌లో అగ్నిప్రమాదం.. ఓ షాపులో మంటలు చెలరేగి పక్కనున్న 8 షట్టర్లకు వ్యాప్తి

హైదరాబాద్ అక్టోబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అల్వాల్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లోతుకుంటలో ఓ షాపులో మంటలు చెలరేగి పక్కనున్న 8 షట్టర్లకు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూటే ఈ ప్రమాదానికి కారణమని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్...

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల అంశం రోజుకో మలుపు తీసుకుంటుంది. ఇప్పుడు తాజాగా రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టుకు చేరింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ వేశారు.

50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ పిటిషన్‌లో చెప్పుకొచ్చారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరాదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగనున్నట్లు సమాచారం.

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లను ఎత్తివేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపింది. దీనికి అన్ని పార్టీల నేతలు అంగీకారం తెలిపారు. ఆ తర్వాత వీటిని గవర్నర్ ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపారు. అయితే ఈ బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు.

రిజర్వేషన్ల బిల్లుపై ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. తమ వద్దనే పెండింగ్‌లోనే ఉన్నాయని ఇటీవల రాజ్ భవన్ వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో బీసీ బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం తెలంగాణ సర్కార్ కు షాక్ అనే చెప్పవచ్చు.

ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఏ తీర్పు ఇస్తోందో.. అనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది

# సరూర్ నగర్ చెరువు వద్ద అమ్మవారి నిమజ్జనంలో అపశ్రుతి గాల్లోకి లేచిన భారీ క్రేన్

రంగారెడ్డి అక్టోబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సరూర్ నగర్ చెరువు వద్ద అమ్మవారి విగ్రహాలు నిమజ్జనం చేస్తుండగా అపశ్రుతి చోటుచేసుకుంది. శనివారం ఉదయం 6గంటలకు అమ్మవారి విగ్రహం నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా భారీ క్రేన్ గాల్లోకి లేచింది. ఒక వైపు బరువు ఎక్కువగా ఉండడంతో క్రేన్ పైకి లేచి ఉంటుందని డ్రైవర్లు తెలిపారు. క్రేన్ కు ఇరువైపులా సమాన బరువును బిగిస్తారు. ఒక వైపు ఎక్కువ బరువును బిగిస్తే ఇలానే జరుగుతుందని డ్రైవర్లు తెలిపారు.

# త్రిపుల్ ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్ మారదు.. త్వరలోనే టెండర్లు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్గొండ, అక్టోబర్ 4:త్రిపుల్ ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్ మారదని, రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. శనివారం చిట్యాలలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 2017- 18లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరించినట్లు తెలిపారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6 శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98 శాతం పైగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. 4 లేన్ల ఖీఖీఖీ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6 లేన్లుగా మార్చుకున్నట్లు తెలిపారు.

సంగారెడ్డి నుండి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ వయా భువనగిరి, చౌటుప్పల్ వరకు 161.518 కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందన్నారు. భూసేకరణ కోసం రూ.6 వేల కోట్లు ఖర్చు అవుతుండగా కేంద్రం, రాష్ట్రం చెరో సగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.3 వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామన్నారు. ఇప్పటికే పలుమార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై పనులు వేగవంతం చేసేలా మాట్లాడినట్లు చెప్పారు. ఉత్తర భాగం అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పు ఉండదని, జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు.

రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం విషయంలో బాధిత రైతులు అనవసర ఆందోళన చెందొద్దన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారంతోనే ముందుకు పోతామని భరోసా ఇచ్చారు. తాను రైతు బిడ్డనేనని..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా త్వరలోనే ముఖ్యమంత్రితో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు ఆయన హామీ ఇచ్చారు. అయితే ఇటీవల పత్రికల్లో, సోషల్ మీడియాలో రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అక్కర్లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ, నిర్మాణం కోసం రూ.45 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. పలువురు అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని, వాళ్ల ట్రాప్ లో పడొద్దని రైతులను కోరారు.

ఫిబ్రవరిలో హైదరాబాద్-విజయవాడ హైవే 8 లేన్ల నిర్మాణ పనులు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తి అని తన పేరు చెప్పి గౌరెల్లి ? భద్రాచలం హైవే, ఎల్బీనగర్ ? మల్కాపురం రోడ్డు జీఓ ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ - విజయవాడ హైవే 8 లేన్ల నిర్మాణ పనులు వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభం కానున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అక్కర్లేదని, రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలైన్‌మెంట్ విషయంలో పెద్ద వాళ్లకు ఒక న్యాయం, పేదవాళ్లకు మరొక న్యాయం ఉండదని, అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు. "నల్లగొండ బిడ్డగా..ఈ గడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోను" అని మంత్రి కోమటిరెడ్డి పునరుద్ఘాటించారు.

చిట్యాల మండలం పెద్ద కాపర్తి శివారులోని హోటల్‌లో త్రిపుల్ ఆర్ రైతులతో మంత్రి మాట్లాడుతూ.. త్రిబుల్ ఆర్ సౌత్ పోర్షన్ కి డీపీఆర్ మాత్రమే అయిందని, ఎలాంటి అలైన్‌మెంట్ జరగలేదని స్పష్టం చేశారు. అలైన్‌మెంట్ అయినట్టు, రైతుల భూములు పోతున్నట్టు వివిధ పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చినా అపోహలను ఎవరూ నమ్మొద్దన్నారు. డిసెంబర్‌లో అలైన్‌మెంట్ అయిన తర్వాత సీఎంతో మాట్లాడి, మంత్రులతో చర్చించి రైతులకు న్యాయం చేస్తానని తెలిపారు.

# ఇల్లెందు సింగరేణి ఏరియా రీజినల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



ఖమ్మం, అక్టోబర్ 4: ఇల్లెందు సింగరేణి ఏరియాలో రీజినల్ స్థాయి క్రీడా పోటీలను ఏరియా జీఎం కృష్ణయ్య శనివారం ప్రారంభించారు. ఇల్లెందు సింగరేణి గ్రౌండ్ లో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 2025 -26 కు గాను ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి మణుగూరు, ఇల్లెందు ఏరియా క్రీడా పోటీలను జిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఒత్తిడి తట్టుకునే విధానం పెంపొందించుకోవచ్చన్నారు. ఉద్యోగులు తమ నిత్య జీవిత విధుల్లో భాగంగా ప్రతిరోజు 30 నిమిషాల పాటు తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

క్రీడల వల్ల క్రమశిక్షణ ఏర్పడుతుందన్నారు. ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తుందని తెలిపారు. యువ ఉద్యోగాలు క్రీడలపై దృష్టి సారించి రాణించి ఇల్లెందు ఏరియాకి మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం రామస్వామి, బోడ ప్రసాద్, జాన్ వెస్లీ, గుర్తింపు సంఘాల బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వర్లు, దాట్ల శ్రీకాంత్, బోడ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

# యశ్వంత్‌పూర్ వందేభారత్‌కు బుధవారమే మెయింటెనెన్స్ హాలీడే

హైదరాబాద్, అక్టోబర్ 4: కాచిగూడ-యశ్వంత్‌పూంవందేభారత్ (20703/04) ఎక్స్‌ప్రెస్‌కు మెయింటెనెన్స్ హాలీడే (ప్రస్తుతం అమల్లో ఉన్న) బుధవారమే ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. వాస్తవానికి ఈ నెల 4వ తేదీ నుంచి మెయింటెనెన్స్ హాలీడేను శుక్రవారానికి మార్పు చేసినట్లు సెప్టెంబరు 12న రైల్వే అధికారులు ప్రకటించారు. అయితే, మెయింటెనెన్స్ హాలీడేతో పాటు స్టాపేజీలు, రైళ్ల వేళల్లోనూ ఎటువంటి మార్పులు లేవని, గతంలో చేసిన ప్రకటనను రద్దు పరిచినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

# ట్రాక్టర్ ట్రాలీ కింద డ్రైవర్ విశ్రాంతి.. చూడకుండా పోనియడంతో మృతి

నల్గొండ, అక్టోబర్ 4: విశ్రాంతి కోసం ట్రాక్టర్ ట్రాలీ కింద పడుకున్న డ్రైవర్ మృతి చెందిన సంఘటన కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండూరి నరేశ్ (26) అదే గ్రామంలోని నిమ్మనగోటి భాస్కర్ ట్రాక్టర్ పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో వరికోత మిషన్ తో కోసిన ధ్యాన్యాన్ని తరలించేందుకు ట్రాక్టర్ ను తీసుకెళ్లాడు. ట్రాక్టర్ లో ధాన్యం నింపుకుని అదే ట్రాక్టర్ ట్రాలీ కింద నరేశ్ విశ్రాంతి కోసం పడుకున్నాడు.

అదే సమయంలో వెనుకాల ఉన్న మరో ట్రాక్టర్ డ్రైవర్ ఎస్‌కే రహీమ్ తన ట్రాక్టర్ ను ముందుకు తీసుకెళ్లే క్రమంలో అడ్డుగా ఉన్న నరేశ్ ట్రాక్టర్ ను అనుమతి లేకుండా స్టార్ట్ చేసి ముందుకు జరిపాడు.

దీంతో ట్రాక్టర్ కింద పడుకున్న నరేశ్ తలపై నుండి ట్రాలీ టైరు వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

# ప్రతి విజేత వెనుక అదృశ్య హస్తం ఉపాధ్యాయుడే !

## (05 అక్టోబర్ "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా)

సామాన్య మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చగల ధీర మేధావి గురువు. తొలి అక్షరం దిద్దించడం, వ్యక్తిత్వ వక్రగుణాలను సవరిస్తూ, సన్మార్గాలను చూపుతూ, అత్యున్నత స్థాయికి ఎదిగే వరకు మన వెంట నిడిచి, వెన్నెముకలా నిలిచి, నిరాశలో ఆశల విత్తులు నాటుతూ, కొవ్వత్తిలా తను కరిగిపోతూ రేపటి తరానికి దారి దీపంగా నిలుస్తూ, తడబడినపుడు ఊత కర్రగా మారగల మహోన్నత దైవ రూపం, నడిచే ఆదర్శాల నిధి గురువు మాత్రమే. పాఠ్యాంశాలను బోధిస్తూ, వెన్నుతట్టి నడక, నడతల్ని నేర్పుతూ, జ్ఞానోదయాన్ని కలిగించగల నిస్వార్థ జీవి ఉపాధ్యాయుడు. ధిల్లీకి రాజైన సద్గురువుకు పాదాభివందనం చేసేది భాద్యతగల శిష్యుడే. పెరిగే మొక్కకు ఊత కర్ర ఉపాధ్యాయుడు. భగవంతుడితో భక్తుడి సంబంధం లాంటిదే గురు శిష్యుల పరమ పవిత్ర సంబంధం. గురువులు సృష్టి కర్త వంటి వారు. విద్యార్థికి జ్ఞానాన్ని అందించి, కొత్త విషయాలను నేర్పించే పాత్రను పోషిస్తారు. గురువు మార్గ నిర్దేశనం చేస్తూ, మోక్షం వైపు నడిపిస్తారు. గురువు పరంధాముడు, అజ్ఞాన చీకట్లను చిదిమేసి జ్ఞానోదయం కలిగించే వారు. గురువు పరివర్తకుడు, భవిష్యత్తు తీర్చిదిద్దే మేధావి.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం – 2025 ఇతివృత్తం:

ప్రపంచవ్యాప్తంగా 94 మిలియన్లకు పైగా ఉపాధ్యాయుడు భావితరాలకా నిర్మించడంలో నిమగ్నం అవుతున్నారు. ఉపాధ్యాయుడు రేపటి తరం నిర్మాతలు. తరగతి గదుల్లోనే జాతి నిర్మాణం జరుగుతుంది. గురువుకను నమ్మిన శిష్యుడికి ఎదురుండదు. గురువు ప్రాధాన్యాన్ని గుర్తించిన యునెస్కో సంస్థ ప్రతి ఏట 05 అక్టోబర్ రోజు "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం (వరల్డ్ టీచర్స్ డే)"గా 1966 నుంచి పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ ఇతివృత్తంగా "ఉపాధ్యాయుల అభిప్రాయాలకు విలువ ఇద్దాం : సరికొత్త విద్యా ఒప్పందం దిశ వైపు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. విజ్ఞానం, లోక జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, వివేకం, విద్యాబుద్ధులు, శాస్త్రీయ దృక్పథం, మంచి అలవాట్లు, ప్రేరణ కల్పించడం, పొరపాట్లను నిర్దయగా సవరించడం, కెరీర్ నిర్మించడం లాంటి బహుముఖీల లక్ష్యాలను మదిలో నింపుకొని తమ విధులను సక్రమంగా, పవిత్రంగా నిర్వహించే గురువులు శిష్యుల దృష్టిలో బ్రహ్మ సమానులే. పుస్తకాల్లో పాఠాలను మాత్రమే బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులు. పాఠ్యాంశాలతో పాటు హృదయపూర్వకంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మహాముభావులు మాత్రమే సద్గురువులు. పిల్లల్లో దయ, కరుణ, ఉత్సుకత, ధైర్యం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ అనబడే విత్తులు నాటి నీడనిచ్చే మహా వృక్షాలుగా మార్చగల మహోన్నతులు సద్గురువులు. ఓపిక, బేషరతు త్యాగాల ప్రతిరూపం ఉపాధ్యాయులు.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు:

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం వేదికగా మన గురువులకు కృతజ్ఞతలు తెలపడం, వారి దీవెనలు పొందడం, వారిని మనస్ఫూర్తిగా సన్మానించడం, సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రేమపూర్వకంగా ఉత్తరాలు రాయడం, విద్యాలయాల్లో సెల్ఫ్ గవర్నమెంటు డే పాటించడం, వారి సేవలను కొనియాడడం, విద్యాలయాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. నిస్వార్థ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను తెలుపడానికి ఈ వేదిక ఎంతగానో ఉపకరిస్తుందని గమనించాలి. కంచే చేనును మెసినట్లు, నేటి ఉపాధ్యాయుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేయడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, విధి నిర్వహణలో ఆల్కహాల్ సేవించడం, కాలక్షేపం కోసం ఉద్యోగం చేయడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం అత్యంత విచారకరం.

అన్ని వృత్తుల మేధావులను తయారు చేసే సర్వ సాధారణ వ్యక్తులు గురువులే అని మనకు తెలుసు. గురు బోధనలు మన జీవితాంతం మన వెంట వస్తాయి. విద్య అనే శక్తివంతమైన ఆయుధంతో ప్రపంచాన్ని సర్వాంగ సుందర ప్రదేశంగా మార్చవచ్చు. ఆవిష్కరణలు, సృజన ఆలోచనలు, స్ఫూర్తి రగల్చడం, సానుకూల మార్పులకు ఉత్ప్రేరకంగా పని చేసేది ఉపాధ్యాయుడు మాత్రమే. ప్రతి విజేత వెనుక ఉపాధ్యాయుడి అదృశ్య హస్తం ఉంటుంది. రేపటి తరం నిర్మాతలుగా నేటి ఉపాధ్యాయులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి డిజిటల్–ఏఐ తరగతి గదుల్లో సాంప్రదాయంతో బోధనలు చేయడానికి ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా మార్చడానికి కృషి చేయాలని కోరుకుందాం.

గురుః బ్రహ్మ గురుః విష్ణు గురు దేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐల ఉన్నతీకరణకు రూ.60,000 కోట్ల పెట్టుబడితో 'పీఎం-సేతు'కార్యక్రమానికి ప్రధానమంత్రి శ్రీకారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 4:యువజనాభివృద్ధికి అండగా నిలిచే ఒక మహత్తర కార్యక్రమానికి నాందిప్రస్తావన జరగబోతోంది.. యువత పురోగతిపై దృష్టి సారించి రూ.62,000 కోట్ల కన్నా ఎక్కువ నిధులను ఖర్చు పెట్టే వివిధ కార్యక్రమాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 4న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమాలు దేశం నలుమూలలా విద్య బోధన, నైపుణ్య సాధనకు దోహదపడడంతో పాటు, వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేయాలన్న తపనకు కూడా అండగా నిలుస్తాయి. ఇదే కార్యక్రమంలో, నేషనల్ స్కిల్ కాన్వొకేషన్ నాలుగో సంచిక 'కౌశల్ దీక్షాంత్ సమారోహ్'ను కూడా నిర్వహిస్తున్నారు. దీనిని ప్రధానమంత్రి దృష్టికోణానికి అనుగుణంగా రూపొందించారు. దీనిలో భాగంగా నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికత్వ శాఖ ఆధీనంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో అఖిల భారత్ స్థాయి అగ్రగాములుగా నిలిచిన 46 మందిని సత్కరిస్తారు.

'పీఎం–సేతు' (ప్రధాన్ మంత్రీ స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబులిటీ ట్రాన్స్‌ఫార్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్)ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం. దీనికి రూ.60,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. దేశంలో 1,000 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ల స్థాయిని పెంచడం ఈ పథకం ఉద్దేశం. ఈ వేయి ఐటీఐలలో 200 ఐటీఐలను కూడలి ఐటీఐలు గానూ, 800 ఐటీఐలను అనుబంధ ఐటీఐలు గానూ (హబ్, స్పోక్ నమూనాలో) రూపొందిస్తారు. ప్రతి ఒక్క కూడలి ఐటీఐ సగటున నాలుగు అనుబంధ ఐటీఐలకు మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. మొత్తంమీద ఆధునిక మౌలిక సదుపాయాలు, ట్రేడ్‌లు, డిజిటల్ విద్యా వ్యవస్థలు, ఇన్‌క్యూబేషన్ సౌకర్యాలు కలిగి ఉండే క్లస్టర్లను అభివృద్ధి చేస్తారు. ఈ క్లస్టర్లను యాంకర్ ఇండస్ట్రీ పార్ట్‌నర్లు నిర్వహిస్తాయి. దీంతో, పరిశ్రమల అవసరాలకు తులతూగే నైపుణ్యాలు విద్యార్థులకు అందివస్తాయి. వారు వాణిజ్య సంస్థల అవసరాల మేరకు పనిచేయగలిగే స్థితికి చేరుకొంటారు. కూడలి ఐటీఐలలో నవకల్పన కేంద్రాలు, శిక్షణనిచ్చే వారిని తీర్చిదిద్దే కేంద్రాలు, ఉత్పత్తి విభాగాలు, నియామక సేవల విభాగాలను ఏర్పాటు చేస్తారు. ఇక అనుబంధ ఐటీఐలు సేవలను విస్తరించడంపై శ్రద్ధ తీసుకుంటాయి. వెరసి, పీఎం–సేతు భారత్‌లో ఐటీఐ అనుబంధ విస్తారిత వ్యవస్థకు సరికొత్త నిర్వచనాన్నిస్తుంది. ఈ వ్యవస్థ ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నప్పటికీ నిర్వహణ బాధ్యతను పారిశ్రామిక రంగం తీసుకొనేదిగా రూపుదిద్దుతారు. ఈ వ్యవస్థకు ప్రపంచ బ్యాంకు నుంచి, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి ఆర్థిక సహాయం అందుతుంది. పీఎం–సేతును అమలు చేసే తొలి దశలో పట్నా, దర్భంగా ఐటీఐలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

దేశంలోని 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 400 నవోదయ విద్యాలయాలు, 200 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 1,200 వొకేషనల్ స్కిల్ ల్యాబులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రయోగశాలలు మారుమూల ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లో చదువుకుంటున్న వారితో సహా ఇతర విద్యార్థులకు వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఆటోమోటివ్, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ, పర్యటన తదితర 12 ప్రధాన రంగాల్లో ఆచరణాత్మక శిక్షణను అందిస్తాయి. సీబీఎస్ఈ పాఠ్యప్రణాళిక, జాతీయ విద్య విధానం–2020ల లక్ష్యాలకు తులతూగేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. విద్యార్థులను పారిశ్రామిక అవసరాలను తీర్చేవారు గానను, ఉద్యోగ యోగ్యతను సంతరించుకొనే వారు గాను తీర్చిదిద్దేందుకు 1,200 మంది వొకేషనల్ టీచర్లకు కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా తగిన శిక్షణను ఇస్తారు. బిహార్‌కు ఉన్న వైభవోపేత వారసత్వాన్నీ, ఆ రాష్ట్రంలో యువ జనాభా ఎక్కువ సంఖ్యలో ఉండడాన్నీ లెక్కలోకి తీసుకొని రాష్ట్రంలో పెను మార్పును తీసుకురాగలిగిన ప్రాజెక్టుల పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మార్పుచేర్పులు చేసిన 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజన'ను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. దీనిలో భాగంగా సుమారు 5 లక్షల మంది గ్రాడ్యుయేట్ యువజనులకు ప్రతి నెల రూ.1,000 చొప్పున భత్యాన్ని రెండు సంవత్సరాల పాటు అందిస్తారు. దీనికి తోడు ఆ యువజనులకు పైసా ఖర్చు చేయ నక్కరలేకుండా వివిధ నైపుణ్యాల్లోనూ శిక్షణనిస్తారు. మెరుగులు దిద్దిన 'బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీము'ను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ పథకంలో భాగంగా, విద్యార్థులకు రూ.4 లక్షల వరకు విద్య రుణాలను అందజేస్తారు. ఇవి వడ్డీ కట్టనక్కర్లేని రుణాలు కావడంతో, ఉన్నత విద్య చదువుకోవడం ఆర్థికంగా ఎలాంటి భారం కాబోదు. ఈ పథకంలో ఇప్పటికే 3.92 లక్షల కన్నా ఎక్కువ మంది విద్యార్థులు రూ.7,880 కోట్ల కన్నా ఎక్కువ రుణాలను అందుకు న్నారు. రాష్ట్రంలో యువతను సాధికారులను చేసే ప్రక్రియను మరింత ముందుకు తీసుకుపోయే ఉద్దేశంతో, రాష్ట్రంలోని 18–45 వయోవర్గానికి చెందిన యువత శక్తి యుక్తులను మంచి మార్గాల్లోకి మళ్లించి సద్వినియోగపరచడానికి 'బీహార్ యువ ఆయోగ్' పేరుతో ఒక చట్టబద్ధ కమిషనుకు రూపకల్పన చేశారు. 'బీహార్ యువ ఆయోగ్'ను ప్రధాన మంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు. బిహార్‌లో జన్ నాయక్ కర్పూరీ ఠాకుర్ నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ విశ్వవిద్యాలయాన్ని వృత్తి సంబంధిత విద్యతో పాటు పరిశ్రమల అవసరాలను తీర్చడం ప్రధానంగా రూపొందించిన కోర్సులను బోధించే లక్ష్యంతో ఏర్పాటు చేశారు.

ఉన్నత విద్యావకాశాలను మెరుగుపరిచే దృష్టికోణంతో రూపొందించిన 'జాతీయ విద్య విధానం–2020'ని ముందుకు తీసుకుపోతూ 'పీఎం–ఉషా' (ప్రధాన్ మంత్రీ ఉచ్చతర్ శిక్షా అభియాన్)లో భాగంగా, బిహార్‌లో 4 విశ్వవిద్యాలయాల్లో కొత్తగా విద్య, పరిశోధన కేంద్రాల నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఆ నాలుగు యూనివర్సిటీలూ.. పట్నా యూనివర్సిటీ, మధేపురాలోని భూపేంద్ర నారాయణ్ మండల్ యూనివర్సిటీ, ఛప్రాలోని జై ప్రకాశ్ విశ్వవిద్యాలయతో పాటు పట్నాలోని నలందా సార్వత్రిక విశ్వవిద్యాలయం. ఈ విద్య, పరిశోధన కేంద్రాల నిర్మాణానికి రూ.160 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయిన తరువాత, వీటి ప్రయోజనాలను 27,000 మంది విద్యార్థులు అందుకుంటారు. ఈ కేంద్రాల్లో ఆధునిక విద్య బోధన కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఉన్నత సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలలు, వసతిగృహాలు, వివిధ కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

ఎన్ఐటీ పట్నాలో బిహ్టా కేంపసును దేశ ప్రజలకు ప్రధానమంత్రి అంకితం చేస్తారు. మొత్తం 6,500 మంది విద్యార్థులకు నిలయంగా నిలిచే ఈ కేంపసులో 5జీ వినియోగ సామర్థ్యం కలిగిన ల్యాబునూ, ఇస్రో సహకారంతో ఒక ప్రాంతీయ అంతరిక్ష విద్య కేంద్రాన్నీ, ఇప్పటికే 9 అంకుర సంస్థలకు ప్రోత్సాహాన్ని అందించిన ఒక ఇన్నొవేషన్, ఇన్‌క్యూబేషన్ సెంటరునూ ఏర్పాటు చేశారు.

బిహార్ ప్రభుత్వంలో కొత్తగా నియామక ప్రక్రియ పూర్తి చేసిన 4,000 కన్నా ఎక్కువ మంది అభ్యర్థులకు నియామక పత్రాలను కూడా ప్రధానమంత్రి అందజేస్తారు. అలాగే 'ముఖ్యమంత్రి బాలక్, బాలిక స్కాలర్‌షిప్ స్కీము'లో భాగంగా 25 లక్షల మంది తొమ్మిదో తరగతి, పదో తరగతి విద్యార్థులకు రూ.450 కోట్ల విలువైన ఉపకార వేతనాలను ప్రయోజనాల నేరు బదలీ (డీబీటీ) పద్ధతిలో ప్రధానమంత్రి విడుదల చేస్తారు.

# జీవో నెం.7ను తక్షణమే అమలు చేయాలి

### - పేద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు నర్సింగ్ విద్యలో న్యాయం చేయండి
### - తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ డిమాండ్
### – రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమల్ల సత్యం



ఖమ్మం, అక్టోబర్ 4 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.7 (తేదీ:19.07.2021) ను తక్షణమే పూర్తిగా అమలు చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టిఎస్ ఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం, పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నర్సింగ్, పారామెడికల్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన వారికి కన్వీనర్ కోటా ఫీజు రేట్లకే స్కాలర్‌షిప్ (పోస్ట్ మేట్రిక్ స్కాలర్షిప్) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ నిర్ణయం ఇప్పటికీ అమల్లోకి రాకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టిఎస్ఎస్ఏ ఆవేదన వ్యక్తం చేసింది. టిఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమల్ల సత్యం మాట్లాడుతూ...

"జీవో నెం.7 ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 5000 మంది పైగా ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు నర్సింగ్, పారామెడికల్ విద్యలో లబ్ధి పొందాలి కానీ ఇప్పటికీ ఆ ఉత్తర్వు అమలు కాలేదు. ప్రభుత్వం వెంటనే జీవో నెం.7ను మళ్లీ అమలు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దమల్ల సత్యం జీవో నెం.7ను అమలు చేసి "నర్సింగ్ విద్య అంటే కేవలం ఉద్యోగం కాదు అది సేవ.. పేద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు ఈ రంగంలోకి రావడం వలన సమాజంలో ఆరోగ్య సేవల స్థాయి పెరుగుతుంది. ప్రభుత్వం ఈ విద్యార్థులకు సహాయం చేయడం ద్వారా ఆరోగ్య రంగానికి, సమాజానికి గొప్ప మేలు చేస్తుందన్నారు. తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థి సంఘాలను, సామాజిక సంస్థలను ఈ డిమాండ్‌కి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిఓ నెం.7ని అమలు చేసి, పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నర్సింగ్ విద్యలో న్యాయం చేయాలని విద్యార్థి సంఘం కోరింది.

# దిగొచ్చిన హమాస్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ఇజ్రాయెల్ – హమాస్ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నయుద్ధాన్నిఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ప్రణాళికను రూపొందించారు. దీనిని అంగీకరించకపోతే నరకం చూపిస్తానంటూ హమాస్ దేశానికి తీవ్ర హెచ్చరికలు చేశారు. దీంతో హమాస్ కాస్తా దిగొచ్చింది. ట్రంప్ ప్రణాళిక ప్రకారం తమ చెరలోని ఇజ్రాయెల్ (1) బందీలందరినీ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

అయితే, ఆయన ప్రతిపాదించిన కొన్ని అంశాల్లోని విషయాలపై చర్చలు జరపాల్సి ఉందని పేర్కొంది. ఈ చర్చలు వెంటనే జరగాలని, అందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది. గాజా పరిపాలనను స్వతంత్ర సాంకేతిక నిపుణుల పాలస్తీనా సంస్థకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా యుద్ధం ముగించి, శాంతి నెలకొల్పేందుకు అరబ్, ఇస్లామిక్, అంతర్జాతీయ భాగస్వాములతోపాటు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు కృతజ్ఞతలు తెలిపింది.

# హెల్త్ ఇన్సూరెన్స్ తెస్తాం

### -గతుకు రోడ్లు పోయాయి
### -అన్నా కాంటీన్లు పునరుద్ధరిస్తాం
### -ఎలక్ట్రికల్ వెహికల్ కు వెళ్దాం
### -ఆటో డ్రైవర్ల సేవలో.. సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 4: రోడ్డు అధ్వాన్నంగా తయారైనా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు.. గతుకుల రోడ్లపై డ్రైవర్లు చాలా ఇబ్బందిపడ్డారు. ఇప్పుడు రోడ్లు బాగుపడ్డాయి. ప్రయాణాలకు ఇబ్బంది లేదు. ఉచిత ప్రయాణ సౌకర్యంతో మంహిళలు సంతోషంగా ఉన్నారు..



ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయి ఆటో డ్రైవర్లంటే చాలామంది పేదవాళ్లే ఉంటారు .. ఏడాదికి రూ. 15 వేలు ఇస్తే.. వారికి కొంత ఊరటగా ఉంటుంది, అందుకే ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నాం, అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడ సింగ్ నగర్ లోని విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అంతముందు ఉండవల్లి నుంచి ఆటోలో సీఎం సింగ్ నగర్ కు చేరుకున్నారు.

ఇక్కడ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికలు నా చరిత్రలో ఎప్పుడూ చూడనిది ? 94 శాతం స్ట్రైక్ రేట్ తో గెలిపించారు. ఇప్పుడు మంచి ప్రభుత్వం మరిన్ని మంచి పనులు చేస్తోంది. 15 నెలల మా పాలనలో ఎన్నో పథకాలు తీసుకొచ్చాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. పింఛన్ల మొత్తాన్ని భారీగా పెంచి ఆదుకుంటున్నాం. పింఛన్ల కోసం రూ. 33 వేల కోట్లు ఖర్చు పెడుతున్న ఏకైక ప్రభుత్వమిది. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం ఎత్తేసింది. కూటమి ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లను పునరుద్ధరించాం.

విజయవాడలో అన్నీ వెహికల్స్ సీఎన్ జీకి మార్చడం సంతోషం. రాబోయే రోజుల్లో సీఎన్ జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ కు వెళ్లాం. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తో అందరినీ ఆదుకుంటాం. పేదల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత తీసుకుంటున్నాం. రూ.25 లక్షల వరకు హెల్త్ పాలసీ వర్తించేలా చర్యలు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం.. మంచి చేయడమే మా పని.

దేశంలోనే మొదటి సారిగా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 750 సేవలు నేరుగా అందిస్తున్నాం. సాంకేతికతను పేద ప్రజల కోసం ఉపయోగిస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం. సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం సాగుతోంది. జీఎస్టీ 02 ద్వారా సూపర్ సేవింగ్స్. దసరా, దీపావళి, సూపర్ సిక్స్, సూపర్ జీఎస్టీ, జీఎస్టీ సంస్కరణల ద్వారా ధరలు బాగా తగ్గిపోతున్నాయి.

గత ఐదేళ్ల విధ్వంసం నా జీవితంలో చూడలేదు. దుర్మార్గులు రాజకీయాల్లో ఉంటే అభివృద్ధి శూన్యం. దుష్టశక్తులు రాకుండా ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం సాగుతోంది×× అని సీఎం చంద్రబాబు అన్నారు.

# మంత్రి శ్రీహరితో అజారుద్దీన్ భేటీ

### –మంత్రి శ్రీహరితో అజారుద్దీన్ భేటీ



హైదరాబాద్, అక్టోబర్ 4:భారత క్రికెట్ మాజీ కెప్టెన్, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజారుద్దీన రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ రోజు హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో మంత్రి వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు వివిధ అంశాలపై చర్చించారు. అజారుద్దీన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిరువురు వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. రవికుమాం ఉన్నారు.

# రూ.5 కోట్ల బీమా కోసం వ్యక్తి హత్య.. క్లైమ్ చేసిన నకిలీ భార్య

బెంగళూరు, అక్టోబర్ 4: ఒక వ్యక్తి రూ.5 కోట్లకు జీవిత బీమా చేసినట్లు ఒక ముఠా తెలుసుకున్నది. దీంతో అతడ్ని హత్య చేసి ఆ డబ్బులు పొందేందుకు ప్రయత్నించింది. ఆ ముఠాకు చెందిన మహిళ నకిలీ భార్యగా నటించింది. అయితే పోలీసుల దర్యాప్తులో ఈ ముఠా వ్యవహారం బయటపడింది. కర్ణాటకలోని హోస్పేట్‌లో ఈ సంఘటన జరిగింది. పాక్షికంగా పక్షవాతం ఉన్న 34 ఏళ్ల గంగాధర్‌కు రూ.5.2 కోట్ల జీవిత బీమా పాలసీ ఉన్నట్లు ఆరుగురు సభ్యుల ముఠా గుర్తించింది. ఆ బీమా డబ్బు పొందేందుకు ప్లాన్ వేసింది.

కాగా, ఆ ముఠా సభ్యులు గంగాధర్‌ను హత్య చేశారు. అతడి మృతదేహాన్ని నగర శివారు ప్రాంతానికి తరలించారు.

ద్విచక్ర వాహనంపై గంగాధర్ మృతదేహాన్ని ఉంచి కారుతో ఢీకొట్టారు. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. అనంతరం ఆ ముఠాకు చెందిన హులిగెమ్మ, గంగాధర్ భార్యగా పేర్కొంటూ బీమా కోసం క్లైమ్ చేసింది.

మరోవైపు సెప్టెంబర్ 28న ఉదయం 5.30 గంటలకు సందూర్ రోడ్డులో హిట్ అండ్ రన్ కేసు గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడ్ని గంగాధర్‌గా గుర్తించారు. హోస్పేట్‌లోని కౌల్పేటకు చెందిన అతడి భార్య శారదమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమెను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు.

కాగా, గంగాధర్‌తో ఆరేళ్ల కిందట తనకు పెళ్లి జరిగినట్లు భార్య శారదమ్మ తెలిపింది. మూడేళ్ల కిందట భర్తకు పక్షపాతం వచ్చిందని, ఎడమ వైపు శరీరంలో చలనం లేదని చెప్పింది. తన భర్తకు ద్విచక్ర వాహనం లేదని వివరించింది.

దీంతో గంగాధర్ మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దర్యాప్తు చేయగా అతడి భార్యగా పేర్కొన్న హులిగెమ్మ రూ.5.2 కోట్ల బీమా క్లైయిమ్ కోసం ప్రయత్నించినట్లు తెలుసుకున్నారు. దీంతో ఆమెతో సహా ఆ ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేశారు. నేరానికి వినియోగించిన ద్విచక్ర వాహనం, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఆటో డ్రైవర్ సేవలో మంత్రి లోకేష్

అమరావతి, అక్టోబర్ 4: విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో 'ఆటో డ్రైవర్ సేవలో' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు ఉండవల్లి నుంచి ఆటోల్లో సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ బయలుదేరారు. అంతక ముందు ఉండవల్లిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్ కు మంగళగిరి చేనేత కండువాలు కప్పి మంత్రి లోకేష్ ఘనస్వాగతం పలికారు. సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ లకు మద్దతుగా పెద్ద ఎత్తున మంగళగిరి ప్రజలు తరలి వచ్చారు. మంత్రి లోకేష్ అందరినీ ఆత్మీయంగా పలకరించారు. బాణాసంచా, తీన్ మార్ డప్పుల తో మంగళగిరి యువత సందడి చేసింది. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికసాయం అందించే 'ఆటో డ్రైవర్ సేవలో' పథకకం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మాధవ్ పాల్గొంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 15 వేల ఆర్థిక సాయం చేస్తోంది. ఒక్కో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థికసాయం చేస్తోంది. తొలి ఏడాది 2,90,669 మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్ల మేర వారి ఖాతాల్లో జమ చేస్తోంది. 2.64 లక్షల మంది ఆటో డ్రైవర్లు, 20,072 మంది ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 6,400 మంది మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు కి లబ్ధి చేకూరుతుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్న తరుణంలో,.. చిరువ్యాపారులు, మహిళ కూలీలు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ స్థితిలో షేర్ ఆటోలు నడిపే ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బ తినటంతో.. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వనప్పటికీ ఆటో డ్రైవర్లకు సాయం అందించాలని నిర్ణయం సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

# ఆటో డ్రైవర్లకు ఎన్నికల్లో ఇవ్వని హామీ

## -మంత్రి కందుల దుర్గేష్



అమరావతి, అక్టోబర్ 4: ఆటో డ్రైవర్లకు కూటమి సర్కారు అండగా ఉంటుందని మంత్రి కందుల దుర్గేష్‌భరోసానిచ్చారు. శనివారం గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేష్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని వివరించారు. ఆటోలో తమ ప్రయాణ అనుభూతులను గుర్తు చేసుకున్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలని నినదించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.

తద్వారా రాష్ట్రవ్యాప్తంగా సొంత వాహనం కలిగిన ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 2,90,669 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున రూ.436 కోట్లు నేరుగా జమ చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లాలో 13,194 మంది లబ్ధిదారుల ఖాతాల్లో దాదాపు రూ.20 కోట్లు జమ చేస్తున్నామన్నారు.

రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా ప్రయాణీకులు ముందుగా ఆధారపడేది ఆటోలపైనే అని మంత్రి దుర్గేష్ అన్నారు. బస్సులు సైతం వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు కూడా ఆటోలు వెళ్తూ ప్రయాణీకులకు సేవలు అందిస్తున్నాయన్నారు. పగలు, రాత్రి కష్టపడుతూ స్వయం కృషితో ఎదిగిన ఆటో డ్రైవర్లకు మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేసినప్పుడు తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆటోడ్రైవర్లు తమకు విన్నవించారని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా వారి బాధలు, గాథలు విన్న కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నాకూడా ఆటో డ్రైవర్లకు సేవలో కార్యక్రమం ద్వారా ఆర్థిక భరోసా అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడుకు ఆటో డ్రైవర్ల తరపున మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

గత ప్రభుత్వం వాహనమిత్ర క్రింద రూ.10,000 ఇచ్చిందని మంత్రి దుర్గేష్ అన్నారు. కానీ నాడు గ్రీన్ ట్యాక్స్ భారీగా విధించడం, రోడ్లు అధ్వాన్నంగా ఉండటం, పోలీస్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం తదితర కారణాల వల్ల ఆ సొమ్ము దేనికీ ఉపయోగంలో లేకుండా పోయిందన్నారు. పైగా గత ప్రభుత్వం అనుసరించిన అనాలోచిత విధానాల వల్ల అదనంగా ఆటో డ్రైవర్లు మరో రూ.10 వేలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొన్నవిషయాన్ని, నాడు ఆటోడ్రైవర్లు అనుభవించిన ఇబ్బందులను, ఎదుర్కొన్నఅవాంతరాలను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో లింక్ రోడ్లువేస్తున్నామన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్లు వేస్తున్నామన్నారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ద్వారా ప్రధాన రహదారులు అన్నీబాగుచేశామన్నారు. గ్రీన్ ట్యాక్స్ను రూ. 3 వేలకు తగ్గించామన్నారు. తద్వారా సజావుగా ప్రయాణం సాగి, పెట్రోల్ ఆదా జరుగుతుందన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అందించిన రూ.15000 ఆర్థిక సాయం కుటుంబ అవసరాల కోసం వినియోగించుకునే అవకాశం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని మంత్రి కందుల దుర్గేష్ భరోసానిచ్చారు. ఆటో డ్రైవర్లు స్వయం కృషితో ఉపాధి సృష్టించుకొని చరిత్రసృష్టిస్తున్నారని అన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చడం కోసం ప్రభుత్వం అన్ని ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందన్నారు. విశిష్ట అతిథి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నిరంతరం స్టీరింగ్ తో బతుకు ప్రయాణాన్నికొనసాగిస్తున్నఆటోడ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బాగుండే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో రోడ్లు బాగుపడ్డాయన్నారు. తద్వారా వాహన యజమానులకు మరమ్మత్తుల ఖర్చులు తగ్గాయన్నారు.

ఆటో డ్రైవర్లపై భారం పడకుండా గ్రీన్ ట్యాక్స్‌తగ్గించామన్నారు. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారుల నుండి ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు పెద్దపీట వేసి గంజాయి వాడకాన్ని తగ్గించామన్నారు. బడ్జెట్‌లో 60 శాతానికి పైగా సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర సమిష్టి కృషితో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో చేపడుతున్నామన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సభకు అధ్యక్షతవహించారు.

ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ఆటోలకు పర్మిట్ ఇవ్వొద్దని, తద్వారా స్థానికంగా ఉండే ఆటోడ్రైవర్ల పొట్టకొట్టినట్లుందని ఆటోడ్రైవర్లు విన్నవించారు. కుల, మత, ప్రాంత, పార్టీ, వర్గాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తోందని వక్తలు పేర్కొన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని పలువురు ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఘంటాపథంగా చెప్పారు.

గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా గమనించాలని సూచించారు. సంక్షేమం ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా ఉండాలన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాస రావు, మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రవాణా అధికారి సీతారామ్ రెడ్డి, హజ్ కమిటీ ఛైర్మన్, ఏపీ ఇండస్ట్రీస్ ఛైర్మన్ దేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీస్ ఛైర్మన్ మోహన కృష్ణ, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లేల ఈశ్వరరావు, జనసేన జిల్లా ఇంచార్జ్ గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# నివేదిక పంపండి

అమరావతి, అక్టోబర్ 4:ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాలను, రహదారులు, విద్యుత్ తదితర నష్టాలను అంచనా వేసి శనివారం సాయంత్రం లోగా పంపాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఎటువంటి వివాదాలకు తావు లేని, ఖచ్చితమైన, పారదర్శకమైన అంచనాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలను పంపాలని సూచించారు.

శనివారం ఉదయం కలెక్టర్ యూరియా సరఫరా, భారీ వర్షాలు, జీ.ఎస్.టీ కాంపెయిన్ తదితర అంశాల పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సరఫరా పై వ్యవసాయ శాఖ అధికారుల నుండి అభిప్రాయాన్ని తీసుకున్నారు. సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. సూపర్ జీ.ఎస్.టీ పై ఏ రోజు షెడ్యూల్ ఆ రోజు పాటించాలని సూచించారు. కార్యక్రమాల వివరాలను వెబ్సైట్ నందు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ టీసీలో జేసీ సేధు మాధవన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే సామాజిక దృక్పథం..

## -డీఈవో భూపతిరావు

కర్నూలు, అక్టోబర్ 4:రాష్ట్రంలో క్రీడలకు హబ్ గా కర్నూలు అవరిస్తోందని కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం గార్గేయపురం సమీపంలోని కర్నూలు సిటీ ఫారెస్ట్ చెరువు వద్ద రాష్ట్రస్థాయి 4వ కెనోయింగ్, కయాకింగ్, డ్రాగన్ బోట్ పోటీలను ఘనంగా ప్రారంభించారు.

ఈ పోటీలను రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూలు సెంటర్ ఇన్‌చార్జ్ కార్తికేయన్, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయ్ కుమార్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి డాక్టర్ రుద్రరెడ్డి, జిల్లా యోగ సంఘం ఉపాధ్యక్షుడు సాయి కృష్ణ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిఈఓ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు నూతన క్రీడలను అభివృద్ధి చేయడానికి చేస్తున్న కృషి ప్రశంసనీయం. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తేనే వారి భవిష్యత్తు దృఢంగా ఉంటుంది.

క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక సమతుల్యతతో పాటు సామాజిక విలువలు పెంపొందుతాయి అని పేర్కొన్నారు. డీఎస్డీఓ భూపతిరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పూర్తి సహకారం అందిస్తుంది. క్రమశిక్షణతో సాధన చేసే క్రీడాకారులు తప్పక ఫలితాలు సాధిస్తారన్నారు.

రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో విజయ్ కుమార్ మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపు–ఓటములను సమానంగా స్వీకరించడం క్రీడాస్ఫూర్తి. క్రమం తప్పకుండా సాధన చేస్తే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించగలరు అని సూచించారు.

క్రీడల మైదానం మాత్రమే కాకుండా ఇప్పుడు నీటిమీద కూడా కర్నూలు జిల్లా కొత్త చరిత్ర రాస్తుందన్నారు. కెనోయింగ్, కయాకింగ్, డ్రాగన్ బోట్ వంటి జల క్రీడలు ఈ ప్రాంత విద్యార్థులకు కొత్త అవకాశాలను తీసుకొస్తాయని పేర్కొన్నారు.

భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మాత్రమే కాకుండా అంతర్జాతీయ వేదికలపై కూడా కర్నూలు నుంచి జల క్రీడాకారులు వెలుగొందే రోజు దూరంలో లేదని నిర్వాహకులు పేర్కొనడం విశేషం.

ఈ కార్యక్రమంలో కెనోయింగ్ –కయాకింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ డ్రాగన్ బోట్ అసోసియేషన్ కార్యదర్శి మంచికంటి అవినాష్, జిల్లా వాటర్ స్పోర్ట్స్ కోచ్ చంద్రశేఖర్, జిల్లా స్కేటింగ్ సంఘం సునీల్ కుమార్, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

# యూపీఎస్సీ 2022 ఫలితాల విషయంలో తప్పుదారి పట్టించే ప్రకటనను ఇచ్చినందుకు దృష్టి ఐఏఎస్‌కు రూ. 5 లక్షల జరిమానా విధించిన కేంద్ర వినియోగదారు రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ)

న్యూఢిల్లీ, అక్టోబర్ 4:యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్ఈ) 2022 ఫలితాల విషయంలో తప్పుదారి పట్టించే ప్రకటన ఇచ్చినందుకు దృష్టి ఐఏఎస్‌కు (వీడీకే ఎడ్యువెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్) కేంద్ర వినియోగదారు రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) 5 లక్షల జరిమానా విధించింది.

దృష్టి ఐఏఎస్ ఒక ప్రకటనలో 'యూపీఎస్సీ సీఎస్ఈ–2022లో 216 కంటే ఎక్కువ అభ్యర్థులు ఎంపిక'' అని పేర్కొంటూ.. ఫోటోలతో పాటుగా అభ్యర్థుల పేర్లను పొందుపరిచింది.

అయితే సీసీపీఏ పరిశీలనలో ఈ ప్రకటన తప్పుదారి పట్టించేదిగా ఉందని తేలింది. అభ్యర్థులు తీసుకున్న కోర్సుల రకం, వ్యవధికి సంబంధించిన కీలకమైన సమాచారాన్ని దాచిపెట్టినట్లు గమనించింది.

దృష్టి ఐఏఎస్ పేర్కొన్న 216 మంది అభ్యర్థులలో 162 మంది (75 శాతం) యూపీఎస్సీ సీఎస్ఈ ప్రాథమిక పరీక్ష, ప్రధాన పరీక్షలను స్వతంత్రంగా రాసిన అనంతరం ఈ సంస్థ ఇచ్చే ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్ (ఐజీపీ) మాత్రమే తీసుకున్నారని దర్యాప్తులో తేలింది. 54 మంది విద్యార్థులు మాత్రమే ఐజీపీతో పాటుగా ఇతర కోర్సులను తీసుకున్నారు. ఈ కీలక విషయాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టటంతో అభ్యర్థులు యూపీఎస్సీ పరీక్షలోని అన్ని దశలను దృష్టి ఐఏఎస్ ద్వారానే దాటారనే తప్పుడు నమ్మకాన్ని తల్లిదండ్రులు, అభ్యర్థులకు కల్పించింది. వినియోగదారుల రక్షణ చట్టం– 2019లోని సెక్షన్ 2(28) కింద ఇది తప్పుదారి పట్టించే ప్రకటన.

పదే పదే ఉల్లంఘనకు పాల్పడుతోన్న దృష్టి ఐఏఎస్: ఇలాంటి కారణంతో దృష్టి ఏఐఎస్‌కు జరిమానా విధించటం ఇది రెండోసారని సీసీపీఏ తెలిపింది. ఇంతకు ముందు సెప్టెంబర్ 2024లో "యూపీఎస్సీ సీఎస్ఈ 2021లో 150 కంటే ఎక్కువ అభ్యర్థులు ఎంపిక" అంటూ ఇచ్చిన తప్పుదారి పట్టించే ప్రకటన విషయంలో కూడా తుది ఆదేశాలను సీసీపీఏ ఇచ్చింది. 150 కంటే ఎక్కువ అభ్యర్థుల ఎంపిక అనే ప్రకటనను బలపరుస్తూ 161 మంది అభ్యర్థుల వివరాలను సమర్పించింది. ఈ 161 మంది అభ్యర్థులలో ఐజీపీలో 148 మంది, మెయిన్స్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లో ఏడుగురు, జీఎస్ ఫౌండేషన్ కోర్సులో నలుగురు, ఆప్షనల్ కోర్సులో ఒక్కరు, మిగిలిన ఇంకొక్కరి వివరాలు అందించలేదని దర్యాప్తులో తేలింది. ఈ విషయంలో రూ. 3 లక్షల జరిమానా విధించిన సీసీపీఏ.. తప్పుదారి పట్టించే ప్రకటనను నిలిపివేయాలని ఆదేశించింది.

ఇంతకుముందే జరిమానా విధిస్తూ హెచ్చరించినప్పటికీ 2022 పరీక్షా ఫలితాల విషయంలో కూడా దృష్టి ఐఏఎస్ మరోసారి పాత పద్ధతిలోనే '216 కంటే ఎక్కువ అభ్యర్థుల ఎంపిక" అంటూ సంఖ్యను పెంచింది. ఈ విధంగా వినియోగదారుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘిస్తోంది.

వినియోగదారుల రక్షణ చట్టం, 2019 లోని సెక్షన్ 2(9) ప్రకారం.. ముఖ్యమైన విషయాలను దాచిపెట్టటం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు సమాచారంతో కూడిన ఎంపిక హక్కును కోల్పోతారు. ఇటువంటి ప్రకటనలు తప్పుడు అంచనాలను సృష్టిస్తాయి.. వినియోగదారుల నిర్ణయాలను అన్యాయంగా ప్రభావితం చేస్తాయి. వాస్తవాలను పారదర్శకంగా బహిర్గతం చేయకుండా పెద్ద పెద్ద ప్రకటనలు చేసినప్పుడు ఇది ఇంకా ఎక్కువ అవుతుంది. ఇప్పటి వరకు సీసీపీఏ.. తప్పుదారి పట్టించే ప్రకటనలు, అసంబద్ధమైన వ్యాపార పద్ధతుల విషయంలో వివిధ కోచింగ్ సంస్థలకు 54 నోటీసులు జారీ చేసింది. 26 కోచింగ్ సంస్థలకు రూ. 90.6 లక్షలకు పైగా జరిమాన విధిస్తూ.. తప్పుదారి పట్టించే ప్రకటనలను నిలిపేయాలన్న ఆదేశాలను జారీ చేసింది. ఈ సంస్థలన్నీ ఆయా ప్రకటనల్లో ఎంపికైన అభ్యర్థులు తీసుకున్న కోర్సుల వివరాలను తెలిపే ముఖ్యమైన సమాచారాన్ని దాచిపెట్టాయని సీసీపీఏ గుర్తించింది. దీన్ని వినియోగదారుల రక్షణ చట్టం–2019 .. తప్పుదారి పట్టించే ప్రకటనగా పరిగణిస్తోంది.

విద్యార్థులు కోర్సుల ఎంపిక విషయంలో సమాచారంతో కూడిన న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకునేందుకు అన్ని కోచింగ్ సంస్థలు ప్రకటనల్లో నిజాయితీగా సమాచారాన్ని పొందుపరచాలని సీసీపీఏ ప్రధానంగా చెప్పింది.

# కాంగ్రెస్ తప్పుడు నిర్ణయాలతో పేదలకు నష్టం

## –కాంగ్రెస్ తప్పుడు నిర్ణయాలతో పేదలకు నష్టం



హైదరాబాద్, అక్టోబర్ 4: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వందేళ్ల ముందు చూపుతో నగరం నలువైపులా నాలుగు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించ తలపెట్టారని, ప్రస్తుత ప్రభుత్వం బుద్ధిమాంద్యంతో వాటిని పూర్తి చేయలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అప్పట్లో టిమ్స్ లతో పాటు, నిమ్స్ రెండు వేల పడకల ఆసుపత్రి నిర్మించాలని శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. గతంలో అనేక ప్రభుత్వాలు పని చేసినా నిజాం కాలంలో కట్టిన గాంధీ, ఉస్మానియా, కింగ్ కోఠి ఆసుపత్రులే ఉన్నాయి.

కేసీఆర్ పేదల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని, నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు చేరువ చేసేలా నాలుగు టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ హెల్త్ సిటీ పనులను ప్రారంభించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుల తప్పుడు చర్యల వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈరోజు ఎల్‌బీ నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ చైర్మన్లు, ఇతర సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు వెంట ఉన్నారు.

ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు పూర్తి స్థాయిలో కేటాయించారని, దాదాపు పనులు పూర్తి చేశారనీ, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ముందుకు పోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని హరీశ్‌రావు అన్నారు. సెల్లార్ తో కలుపుకొని ఆరు అంతస్తుల భవనం ఎల్బీ నగర్ టిమ్స్ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. రెండేళ్లలో ఐదు అంతస్తులు మాత్రమే పూర్తి చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఈ ఆస్పత్రుల్లో ద్వారా ప్రజలకు సేవలు అంది ఉండేవి అన్నారు. ఎందుకు పనులు నిలుపు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీలో పది వేల బెడ్స్ ఉండాలని కేసీఆర్ చూశారని హరీశ్‌రావు చెప్పారు. 33 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఉండేలా ప్రణాళిక చేశారని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో తమ ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు చేస్తే, జీవో జారీ చేస్తే, దాన్ని ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. మహేశ్వరంలో మెడికల్ కాలేజీ లేకుండా చేశారని, కుత్బుల్లాపూర్ లో మెడికల్ కాలేజీ శాంక్షన్ చేస్తే, దాన్ని టిమ్స్ అల్వాల్ లో కలిపేశారన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ టిమ్స్ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# దగ్గు సిరప్ తాగి ఆరుగురు చిన్నారుల మృతి..



మధ్యప్రదేశ్, అక్టోబర్ 4: మధ్యప్రదేశ్ చింద్వారా జిల్లాలో దాదాపు పక్షం రోజుల్లోనే ఆరుగురు పిల్లలు కిడ్నీ ఫెయిల్ అయ్యి మృతి చెందారు. ఈ ఘటన కలకలం సృష్టించింది. దగ్గు సిరప్‌తాగడం వల్లే చిన్నారులు మృతి చెందడం తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోల్డ్రిఫ్ సిరఫ్ అమ్మకాలను మధ్యప్రదేశ్ వ్యాప్తంగా నిషేధించింది. అలాగే, సిరప్ తయారీ సంస్థ ఇతర ఉత్పత్తులను సైతం నిషేధించేందుకు చర్యలకు ఉపక్రమించిది. చింద్వారాలో కోల్డ్రిఫ్ సిరప్ కారణంగా పిల్లలు ప్రాణాలు కోల్పోయవడం చాలా విషాదకరమని సీఎం డాక్టర్ మోహన్ యాదవ్ అన్నారు. ఈ సిరప్ అమ్మకాలను మధ్యప్రదేశ్ అంతటా నిషేధించినట్లు తెలిపారు. సిరప్ తయారు చేసిన కంపెనీ ఇతర ఉత్పత్తుల అమ్మకాలను సైతం నిషేధించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

సిరప్ తయారీ కర్మాగారం తమిళనాడులోని కాంచీపురంలో ఉంది. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. ఈ విషయంలో దర్యాప్తు చేయాలని తమిళనాడు సర్కారును కోరింది. ఇందుకు సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి ఇవాళ ఉదయం అందింది. నివేదిక ఆధారంగా సర్కారు కఠిన చర్యలు తీసుకుంది. పిల్లల మృతి వార్త వెలుగులోకి వచ్చాక ఈ విషయంపై దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసింది. ఈ ఘటనలో దోషులను వదిలిపెట్టబోమని హెచ్చరించింది. ఇదిలా ఉండగా.. చింద్వారాలోని పరాసియా బ్లాక్‌లో దాదాపు 15రోజుల్లో తొమ్మిది మంది పిల్లలు కోల్డ్రిఫ్ సిరప్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలువురు చికిత్స తీసుకుంటున్నారు. ఆ సిరప్‌లో నాన్–ఫార్మాకోపోయియా–గ్రేడ్ ప్రొపైలిన్ గ్లైకాల్‌ను ఉపయోగించారని దర్యాప్తులో తేలింది.

ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలైన డైథిలిన్ గ్లైకాల్ (ఆఇఉ), ఇథిలీన్ గ్లైకాల్‌తో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు. ఈ నివేదిక తర్వాత తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్రిఫ్ సిరప్ అమ్మకం, వాడకాన్ని నిషేధించింది. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో స్టాక్‌ను ఫ్రీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కంపెనీకి ఉత్పత్తిని నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తయారీ లైసెన్స్‌ను రద్దుకు షోకాజ్ నోటీస్ పంపారు. ఈ విషయంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు.. తమిళనాడు ఎఫ్‌డీఏ తమిళనాడులోని కాంచీపురంలోని శ్రీసన్ ఫార్మా నుంచి కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ నమూనాలను సేకరించిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నమూనాల్లో డీఈజీ స్థాయి అనుమతించిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలిందని పేర్కొంది.

# దామోదర్ రెడ్డి అంత్యక్రియలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 4:మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు పూర్తయ్యాయి. నాలుగు దశాబ్దాల పాటు నల్గొండ జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో ముద్ర వేసుకున్న దామోదర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంట కండ్ల జగదీష్ రెడ్డి , తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ గారితో పాటు గుంటకండ్ల రాంచంద్రా రెడ్డి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వి. హనుమంత్ రావు , బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు.

# ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల పై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

ఖమ్మం, అక్టోబర్ 4: ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ డైలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు గత 23 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందని జేఏసీ నాయకులు అబ్దుల్ నబీ అన్నారు. ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో ఉన్న బాలికల, బాలుర ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలలో పనిచేస్తున్న డైలివేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు శనివారం సమ్మెను తిరిగి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, జేఏసీ నాయకులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ రామకళా ,మంగలు రొంపెడు బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తూ ఊడిగం చేయిస్తుందని వాపోయారు. పెండింగ్ వేతనాలు ఇవ్వకుండా, కొత్త మెనూ ప్రకారం మరింత పని భారం పెంచిందని ఆరోపించారు. టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో స్వామి, తారబాయ్,నాగేశ్వరరావు, వజ్జ నగేష్, కుమార్, హాస్టల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ డైయిరీపై సవతి తల్లి ప్రేమ : డైయిరీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్



నల్గొండ, అక్టోబర్ 4:విజయ డైయిరీపై కన్నతల్లి ప్రేమ చూపిస్తూ మదర్ డైయిరీపై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నారని ఉమ్మడి నల్లగొండ–రంగారెడ్డి జిల్లాల మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ అన్నారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మదర్ డైయిరీ పాలకుల అసమర్థత, చేతగాని తనంతో డైయిరీ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మూడు దశాబ్దాలుగా యాదాద్రి పుణ్యక్షేత్రానికి నెయ్యి సరఫరా చేస్తున్నప్పటికీ, డైయిరీని ఆర్థికంగా దెబ్బతీసేందుకు నెయ్యి సరఫరా నిలిపి వేశారని ఆరోపించారు.

డైయిరీనే నమ్ముకుని ఉన్న 30 వేల మంది పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించక వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు.

పాడి రైతుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయొద్దని అన్నారు. మదర్ డైయిరీపై విశ్వాసం కోల్పోయి పాడి రైతులు ప్రైవేట్ డైయిరీలను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజా ప్రతినిధులు మదర్ డైయిరీ అభివృద్ధిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోకపోవడం శోచనీయమన్నారు. పాలకులు స్వలాభాలు మానుకుని మదర్ డైయిరీకి పూర్వ వైభవం తీసుకు రావడానికి కృషి చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహమ్మద్ బాబు, పోసుకొండ మధు, పోచకొండ దశరథ, గుర్రాల రాజు, గుంటి శ్రీశైలం పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ హనుమంతరావు



నల్గొండ, అక్టోబర్ 4:: స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం ఆత్మకూర్(ఎం) మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ రాములు నాయక్, డిప్యూటీ తాసీల్దార్ సఫియుద్దిన్, ఎంపీఓ పద్మావతి, ఆర్ఐ మల్లికార్జునరావు, సూపరింటెండెంట్ లోకేశ్వర్ రెడ్డి ఉన్నారు.

# జడ్పిటిసి బరిలో మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం యాదవ్



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 (నేటినిజం ప్రతినిధి) : సుజాతనగర్ మండలం గరీబ్ పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం యాదవ్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పిటిసి అభ్యర్థిగా ఉండడానికి సిద్ధంగా ఉన్నాడు, నీతి నిజాయితీతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఎంతో కృషి చేశాడు. సుజాతనగర్ ప్రాంత ప్రజలకు కసనబోయిన భద్రం యాదవ్ అంటే తెలియని వారు ఉండరు. తాజా ఎంపీటీసీగా ఉన్నప్పుడు సమావేశాలలో గ్రామాలలో మౌలిక వసతులను కల్పించడం కోసం ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం తన గళం విప్పి అధికారులను నిలదీశారు. తమ కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకుంది, ఎంతోమంది గత ప్రభుత్వంలో రాజకీయ నాయకులు బెదిరింపులు చేసిన డబ్బు ఆశ చూపిన దేనికి లొంగకుండా కాంగ్రెస్ పార్టీ జెండా తనకు అండగా ఉందంటూ నిలబడ్డాడు. ఇలాంటి మచ్చలేని నాయకుడు ప్రజా ప్రతినిధిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం కొత్తగూడెం క్లబ్ లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పోదెం వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పిలుపు మేరకు సుజాతనగర్ నుండి జెడ్పిటిసి అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు కసనబోయిన భద్రం యాదవ్ దరఖాస్తును అందించారు, ఎన్నికల్లో తమకు జెడ్పిటిసిగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

# ఖమ్మంలో దంచికొట్టిన వాన

## – అర్ధగంట వ్యవధిలోనే 89.5 మిల్లీమీటర్ల వర్షపాతం

ఖమ్మం, అక్టోబర్ 4: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, వాయుగుండం ఎఫెక్ట్ శనివారం ఖమ్మం రూరల్ మండలం లో స్పష్టంగా కనపడింది. దీంతో సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు సంభవించింది. ఆ వెంటనే దట్టమైన మేఘాలు అలుముకోవడం, కాసేపటికి భారీ నుంచి అతి భారీ వర్షం కురవడంతో అనేక గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో కురిసిన భారీ వర్షానికి జనజీవనం కాసేపు పూర్తిగా స్తంభించిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన మండల వానులకు సాయంత్రం వేళ కురిసిన భారీ వర్షంతో ఉపశమనం కలిగింది.

అయితే భారీ వర్షం పట్ల పత్తి, మిరప తోటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని రైతులు వాపోయారు. ఆయా గ్రామాల్లో వరి పొలాలు ఇప్పుడిప్పుడే ఈనే దశకు రావడంతో భారీగా వీచిన గాలి దుమారానికి వరి పొలాలు నేలవాలి పోయే అవకాశం ఉందని సాగు రైతులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం వేళ ఒక్కసారిగా వర్షం కురవడంతో మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాల నుండి ఇంటికి వెళ్లే విద్యార్థులు, వివిధ వనులు ముగించుకుని ఇంటికి చేరుకునే వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురయ్యారు. పలు గ్రామాల్లో నిలిచిన వరద నీరును తొలగించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు.

# ప్రధానమంత్రి శ్రీ మోదీ 'అంత్యోదయ' దార్శనికత్వంలో సమాజంలో అందరికీ భద్రతను అందించే గమ్యం వైపు దూసుకుపోతున్న భారత్: డాక్టర్ మాండవీయ



న్యూఢిల్లీ, అక్టోబర్ 4:సామాజిక భద్రత కల్పనలో విశిష్ట కృషికి గాను ప్రతిష్ఠాత్మక 'అంతర్జాతీయ సామాజిక భద్రత సంఘం (ఐఎస్ఎస్ఏ) పురస్కారం–2025'ను భారత్‌కు ప్రకటించారు. ఈ అవార్డును మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఈ రోజు నిర్వహించిన వరల్డ్ సోషల్ సెక్యూరిటీ ఫోరమ్ (డబ్ల్యూఎస్ఎస్ఎఫ్)లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2015లో సామాజిక భద్రత పరిధిలో 19 శాతం మంది ఉంటే, ఈ సంవత్సరం (2025)లో 64.3 శాతం మంది సామాజిక భద్రత పరిధిలోకి వచ్చారనీ, ప్రస్తుతం 94 కోట్ల మంది పౌరులకు సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతున్నాయనీ తెలిపారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) గుర్తించిందని కూడా ఆయన అన్నారు.

సామాజిక భద్రత పరిధిని విస్తరించిన తరువాత, ఐఎస్ఎస్ఏ సాధారణ సభలో భారత్ వాటా 30కి చేరింది. ఐఎస్ఎస్ఏ సాధారణ సభలో ఏ దేశానికైనా అత్యధికంగా లభించే ఓట్ షేరు ఇది.

భారత ప్రభుత్వం పక్షాన పురస్కారాన్ని డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అందుకున్నారు. "ఈ పురస్కారం సమాజంలో ఆఖరి వరుసలో ఉన్న వ్యక్తికి సైతం సాధికారతను కల్పించాలని ప్రబోధిస్తూ మాకు మార్గదర్శకంగా నిలుస్తున్న అంత్యోదయ సిద్ధాంతంతో పాటు మా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు నిదర్శనం. అందరికీ సామాజిక భద్రతను సమకూర్చే దిశగా పయనించాలని మాకు అంత్యోదయ సూచిస్తోంద"ని మంత్రి అన్నారు.

ప్రపంచమంతటా సామాజిక భద్రత కల్పన వ్యవస్థలో భారత్ సాధించిన అసాధారణ ప్రగతికి దక్కిన గుర్తింపే ఈ పురస్కారం. ఈ పురస్కారాన్ని ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి ప్రకటిస్తున్నారు. 163 దేశాలకు చెందిన 1,200 కన్నా ఎక్కువ సామాజిక భద్రత విధాన రూపకర్తలు, వృత్తినిపుణులు పాల్గొన్న డబ్ల్యూఎస్ఎస్ఎఫ్ కార్యక్రమంలో ఈ పురస్కార ప్రదానం ముఖ్య ఆకర్షణగా నిలిచింది. ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి దీనిని అందుకొన్న అయిదో దేశం భారత్. ఈ పురస్కారం సామాజిక పరిరక్షణ రంగంలో గొప్పగా కృషి చేస్తూ మార్గదర్శిగా నిలుస్తున్న దేశాల సరసన భారత్‌నూ నిలబెట్టింది.

కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ, సామాజిక భద్రత ప్రయోజనాలను వరుసలోని ఆఖరి వ్యక్తి కి సైతం అందించగల సామర్థ్యం ఉన్న విస్తృత స్థాయి డిజిటల్ వేదికలను భారత్‌లో అందరి అందుబాటులోకీ తీసుకు వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఈ-శ్రమ్ పోర్టల్‌ను గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఈ-శ్రమ్ పోర్టల్ జాతీయ డిజిటల్ సమాచార నిధి. ఇది 31 కోట్ల కన్నా ఎక్కువ మంది అసంఘటిత రంగ శ్రామికులకు సామాజిక సంక్షేమ పథకాల వివరాలను వివిధ భాషల్లో, నిరంతరాయంగా అందించే ఒకే వేదికగా పనిచేస్తోంద"ని డాక్టర్ మాండవీయ అన్నారు.

ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారినీ, ఉద్యోగాలను ఇచ్చే సంస్థలనూ ఒకే వేదిక మీదకు తీసుకు రావడానికి పటిష్ఠ డిజిటల్ పరికరాలు అందుబాటులో ఉండే నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్ రూపొందించినట్లు కూడా డాక్టర్ మాండవీయ తెలిపారు. "చేయి తిరిగిన కార్మికులకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని ఎన్‌సీఎస్‌లో పొందుపరిచారు. ఈ సమాచారాన్ని ప్రపంచం నలు మూలల యాజమాన్య సంస్థలు సులభంగా తెలుసుకోవచ్చు. ఈ సమాచారాన్నంతటినీ ఈ-శ్రమ్ పోర్టల్‌కు కూడా అందిస్తారు. దీంతో మా నిపుణులైన యువ కార్మికులు వారి సామాజిక భద్రత ప్రయోజనాలను నష్టపోకుండానే వివిధ దేశాల్లో ఏయే మెరుగైన అవకాశాలు వారికి లభించనుందీ తెలుసుకోగలుగుతార"ని మంత్రి వివరించారు.

అంత క్రితం, డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రపంచ సామాజిక భద్రత శిఖరాగ్ర సమావేశం సర్వసభ్య సదస్సులో మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణకూ, బీమాకూ సంబంధించిన అనేక పథకాల సేవలను భారత శ్రామికులకు అందించడంలో దేశంలోని రెండు ప్రధాన సామాజిక భద్రత కల్పన సంస్థలైన ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ), ఉద్యోగుల రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ)ల పాత్ర ఎంతో ఉందని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

సాంకేతిక రంగంలోనూ, కార్మిక రంగంలోనూ చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా సామాజిక భద్రత కల్పనకు ప్రాధాన్యం పెరుగుతోందని మంత్రి అన్నారు. "సమగ్ర విధానం, ప్రక్రియలతో పాటు డిజిటల్ వేదికలతో మా సామాజిక భద్రత వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. కొత్త కొత్త ఆదాయార్జన అవకాశాల కల్పనతో పాటు సామాజిక భద్రత వలయం పరిధిని విస్తరించడానికి భారత్ సాంకేతికత సాయాన్ని తీసుకొంటోంది. ఆర్థిక వ్యవస్థ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం, కార్మికులను నిపుణులుగా తీర్చిదిద్దడం, స్వయంఉపాధి అవకాశాలను అందించడంతో పాటు డిజిటల్ నవకల్పన.. ఇవన్నీ జతకలిసే ఒక సంపూర్ణ విధానాన్ని అమలుచేస్తున్నాం" అని ఆయన వివరించారు. "ప్రపంచవ్యాప్తంగా యువజనులకు స్ఫూర్తినివ్వడానికీ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేలా మార్గదర్శకత్వాన్ని అందించడానికీ భారత్ ముందువరుసలో నిలిచింద"ని డాక్టర్ మాండవీయ స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

## – మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 4: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల నాయకులు శనివారం క్యాంపు విమర్శించారు. ప్రభుత్వ మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ చంద్రశేఖర్,ఆనేగౌని అంజయ్యగౌడ్, లచ్చా నాయక్, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, డైరెక్టరు పొట్టి ఆనంద్,మాజీ



కార్యాలయంలో ఆమెను కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను తుంగలో తొక్కిందని నాయకులను నిలదీయాలని కోరారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లలో మెజార్టీ స్థానాలను కేవసం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని రాజశేఖర్‌రెడ్డి, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, దేవరశెట్టి సర్పంచ్‌లు వరంజోతి, జంగయ్య,కరుణాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు తాంద్ర ఇందిరమ్మ దేవేందర్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనరు బొక్క దీక్షిత్‌రెడ్డి, సురుసాని సుదర్శన్‌రెడ్డి, రామక్రిష్ణ, రవీందర్,లు పాల్గొన్నారు.

# మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిని చంపిన తనయుడు

హైదరాబాద్, అక్టోబర్ 4:మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ కుమారుడు తన తల్లిని చంపేశాడు. ఈ ఘటన మంచాల మండ పరిధిలోని ఆరుట్ల గ్రామంలో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. ఆరుట్ల గ్రామానికి చెందిన సోమయ్య, ఎల్లమ్మ(48) దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎల్లమ్మ పెద్ద కుమారుడు శ్రీకాంత్(32) మద్యానికి బానిసగా మారాడు. అయితే మద్యానికి డబ్బులు ఇవ్వాలంటూ శుక్రవారం రాత్రి తల్లితో శ్రీకాంత్ గొడవపడ్డాడు. డబ్బులు ఇచ్చే ప్రసక్తే లేదని తల్లి తెగేసి చెప్పింది. దీంతో కోపంతో ఊగిపోయిన శ్రీకాంత్ ఇనుప రాడ్‌తో తల్లి తలపై బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది.

సమాచారం అందుకున్న మంచాల ఇన్‌స్పెక్టర్ ఏ మధు ఘటనాస్థలానికి చేరుకున్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# భక్తులతో కిటకిటలాడుతున్న యాదాద్రి..



హైదరాబాద్, అక్టోబర్ 4: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి సర్వదర్శనానికి రెండు గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి ఒక గంట సమయం పడుతోంది.

రేపటితో దసరా సెలవులు ముగియనుండడంతో.. యాదాద్రి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అందులోనూ ఇవాళ శనివారం కావడంతో.. భక్తులు భారీగా తరలి వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల రద్దీ ఆదివారం మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

# భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక, మరియు రైతులు దాని ఆత్మ: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4:కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు బీహార్ పర్యటన సందర్భంగా పాట్నాలో జరిగిన రబీ వర్క్‌షాప్ మరియు వ్యవసాయ సలహా సంభాషణలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, సలహాదారులు మరియు రైతులను ఉద్దేశించి శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, "వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, మరియు రైతులు దాని ఆత్మ. రైతులకు సేవ చేయడం దేవుడిని ఆరాధించడం లాంటిది" అని అన్నారు.

భారతదేశ వ్యవసాయ పరివర్తనను గుర్తుచేసుకుంటూ, కేంద్ర మంత్రి మాట్లాడుతూ, "ఖఐ–480 కార్యక్రమం కింద భారతదేశం అమెరికా నుండి ఎర్ర గోధుమలను దిగుమతి చేసుకున్న కాలం ఉండేది. నేడు, మన ధాన్యాగారాలు గోధుమలు మరియు బియ్యంతో నిండి ఉన్నాయి మరియు భారతదేశం ఇతర దేశాలకు ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థితిలో ఉంది." ఈ పురోగతిని రైతుల అవిశ్రాంత కృషి మరియు వ్యవసాయ సలహాదారుల కీలక సహకారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ సలహాదారుల పాత్రను అభినందిస్తూ, వారు లేకుండా పరిశోధనా ప్రయోగశాలల విజయాలు ఎప్పటికీ నేల స్థాయికి చేరుకోలేవని శ్రీ చౌహాన్ అన్నారు. "వ్యవసాయ సలహాదారుల అవసరాన్ని మరియు విలువను ప్రభుత్వం గుర్తించింది మరియు వారి గౌరవం మరియు ప్రయోజనాలను కాపాడటానికి పూర్తిగా కట్టుబడి ఉంది" అని ఆయన అన్నారు.

పప్పుధాన్యాలు మరియు మొక్కజొన్న ఉత్పత్తిలో బీహార్ సామర్థ్యాన్ని హైలైట్ చేస్తూ, కేంద్ర మంత్రి మాట్లాడుతూ, "పప్పుధాన్యాల మిషన్ ద్వారా, భారతదేశం పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధిస్తుంది మరియు వ్యవసాయ సలహాదారులు ఈ ప్రయత్నంలో కీలక పాత్ర పోషిస్తారు" అని అన్నారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన కనీస మద్దతు ధరల పెంపును కూడా ఆయన ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, ప్రధాన మంత్రి ధన్–ధాన్య కృషి యోజన బీహార్‌లోని అనేక జిల్లాలతో సహా తక్కువ ఉత్పాదకత కలిగిన జిల్లాలపై దృష్టి సారిస్తుందని శ్రీ చౌహాన్ తెలియజేశారు. "ఈ పథకం కింద, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి పదకొండు విభాగాలు సమిష్టిగా మరియు సమన్వయంతో పనిచేస్తాయి" అని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి మార్గదర్శక సూత్రమైన 'రాష్ట్రహిత సర్వోపరి' (దేశం ముందు) గురించి శ్రీ చౌహాన్ ప్రస్తావిస్తూ, భారతదేశం తన రైతుల ప్రయోజనాలపై ఎప్పుడూ రాజీపడదని నొక్కి చెప్పారు. "భారతదేశం నేడు స్వతంత్ర మరియు సార్వభౌమ దేశంగా ముందుకు సాగుతోంది, దాని స్వంత నిబంధనల ప్రకారం పనిచేస్తోంది" అని ఆయన అన్నారు.

బీహార్ రైతుల విజయాలను ప్రశంసిస్తూ, కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, రాష్ట్రం అనేక పంటలలో ముందంజలో కొనసాగుతోందని మరియు రాబోయే సంవత్సరాల్లో భారతదేశ శ్రేయస్సుకు వ్యవసాయం బలమైన పునాదిగా కొనసాగుతుందని అన్నారు.

# పేకాట ఆడితే జైలుకే.. జీవితాలు పాడు చేసుకోవద్దు : సీఐ వెంకట్ రెడ్డి

మెదక్, అక్టోబర్ 4: దీపావళి పండుగ ఉందని గ్రామాల్లో పేకాట ఆడితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని కంగ్టి సీఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడైనా పేకాట ఆడితే ఆ స్థలం యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని చెప్పారు. పేకాట వల్ల వచ్చేది ఏమీ ఉండదని, అనవసరంగా జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు.

తాగుడుకు బానిసై చివరికి అప్పులు చేసి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని చెప్పారు. పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని సిర్గాపూర్, కల్హేర్, కంగ్టి మండలాల ప్రజలకు సీఐ వెంకట్ రెడ్డి సూచించారు.

# దుర్గామాతకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పూజలు

నల్గొండ, అక్టోబర్ 4:దేవరకొండ పట్టణంలోని కె కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కొలువైన దుర్గామాతను బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులు దేవరకొండ నియోజకవర్గంపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీల రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ అల్లంపల్లి నర్సింహ, పానుగంటి మల్లయ్య, చేదెళ్ల వెంకటేశ్వర్లు, మాడెం రాములు, వడత్య బాలు, కర్నాటి పురుషోత్తం పాల్గొన్నారు.

# యువత బలం పెరిగినప్పుడు, దేశం మరింత బలంగా పెరుగుతుంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 4:న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు కౌశల్ దీక్షాంత్ సమారోహ్ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రూ.62,000 కోట్లకు పైగా విలువైన యువత–కేంద్రీకృత కార్యక్రమాలను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఐటీఐలతో సంబంధం ఉన్న లక్షలాది మంది విద్యార్థులకు, బీహార్ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఐటీఐ విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున స్నాతకోత్సవ వేడుకలను నిర్వహించే కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించిందని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆ సంప్రదాయంలో నేడు మరో మైలురాయిని సూచిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

నేటి వేడుక భారతదేశం నైపుణ్యాభివృద్ధికి ఇచ్చే ప్రాధాన్యతను సూచిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. విద్య మరియు నైపుణ్యాభివృద్ధి రంగాలలో దేశవ్యాప్తంగా యువత కోసం రెండు ప్రధాన కార్యక్రమాలను ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు. ?60,000 కోట్ల పీఎం సేతు పథకం కింద, ఐటీఐలు ఇప్పుడు పరిశ్రమలతో మరింత దృఢంగా అనుసంధానించబడతాయని శ్రీ మోదీ హైలైట్ చేశారు. దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలు మరియు ఏకలవ్య మోడల్ స్కూల్స్‌లో 1,200 నైపుణ్య ప్రయోగశాలలను ఈరోజు ప్రారంభించినట్లు ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి తొలి ప్రణాళిక విజ్ఞాన్ భవన్‌లో స్నాతకోత్సవ వేడుకను నిర్వహించాలని శ్రీ మోదీ అన్నారు. అయితే, శ్రీ నితీష్ కుమార్ ఈ సందర్భాన్ని మెగా–ఫెస్టివల్‌గా పెంచాలనే ప్రతిపాదనతో ఇది ఒక గొప్ప వేడుకగా – "అలంకరణలతో అలంకరించబడిన బంగారు పెట్టె"గా మారింది. ఈ వేదిక నుండే బీహార్ యువతకు అనేక పథకాలు మరియు ప్రాజెక్టులు అంకితం చేయబడ్డాయని ప్రధానమంత్రి హైలైట్ చేశారు. వీటిలో బీహార్‌లో కొత్త నైపుణ్య శిక్షణ విశ్వవిద్యాలయం స్థాపన, ఇతర విశ్వవిద్యాలయాలలో సౌకర్యాల విస్తరణ, కొత్త యువజన కమిషన్ ఏర్పాటు మరియు వేలాది మంది యువకులకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల కోసం నియామక లేఖల జారీ ఉన్నాయి. ఈ కార్యక్రమాలు బీహార్ యువతకు ఉజ్వల భవిష్యత్తుకు హామీ అని ఆయన ధృవీకరించారు.

లక్షలాది మంది సోదరీమణుల భాగస్వామ్యాన్ని చూసిన బీహార్ మహిళల ఉపాధి మరియు స్వావలంబనపై దృష్టి సారించిన ఇటీవలి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని గుర్తుచేసుకుంటూ, బీహార్‌లో యువత సాధికారత కోసం నేటి మెగా కార్యక్రమం వారి ప్రభుత్వం రాష్ట్ర యువత మరియు మహిళలకు ఇచ్చే ప్రాధాన్యతను మరింత ప్రతిబింబిస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

# గత ఐదేళ్ల విధ్వంసం తన జీవితంలో చూడలేదు

## – దుర్మార్గులు రాజకీయాల్లో ఉంటే అభివృద్ధి శూన్యం

## – మండిపడ్డ సిఎం చంద్రబాబు

అమరావతి అక్టోబర్ 4 (వేక్స్ ప్రెస్ న్యూస్ );: సాంకేతికతను పేద ప్రజల కోసం ఉపయోగిస్తున్నామని ఎపి సిఎం చంద్రబాబు తెలిపారు. సంపద సృష్టిస్తున్నామని అందరికీ అందిస్తున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిఎస్టి–2.0 ద్వారా సూపర్ సేవింగ్స్, దసరా, దీపావళి, సూపర్ సిక్స్, సూపర్ జిఎస్టి అని జిఎస్టి సంస్కరణల ద్వారా ధరలు బాగా తగ్గిపోతున్నాయని తెలియజేశారు. గత ఐదేళ్ల విధ్వంసం తన జీవితంలో చూడలేదని, దుర్మార్గులు రాజకీయాల్లో ఉంటే అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. దుష్ట శక్తులు రాకుండా ప్రజలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తో అందరినీ ఆదుకుంటామని చెప్పారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత తీసుకుంటున్నామని సిఎం పేర్కొన్నారు. రూ. 25 లక్షల వరకు హెల్త్ పాలసీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని మంచి చేయడమే తన పని అని అన్నారు.

# అవినీతి లేకుండా పథకాలు అమలు: చంద్రబాబు

అమరావతి అక్టోబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అవినీతి లేకుండా పథకాలు అమలు చేస్తున్నామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. వైసిపి హయాంలో ఆటో డ్రైవర్లు ఎంతో ఇబ్బంది పడ్డారని అన్నారు. ఈ సందర్భంగా సిఎం మీడియాతో మాట్లాడుతూ..ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ. 15 వేలు చొప్పున జమ చేస్తున్నామని, అధికారంలోకి వచ్చేనాటికి వ్యవస్థలన్నీ ఆగమ్యగోచరం అని తెలియజేశారు. ఒక్కో వ్యవస్థను చక్కబెడుతూ పాలనను గాడిలో పెడుతున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాకే రోడ్లు బాగుచేశామని, స్త్రీశక్తికి ముందే ఆటో డ్రైవర్ల గురించి ఆలోచించామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# కామారెడ్డిలో "జలవిలయం" కవిత్వ పుస్తకాన్ని ఆవిష్కరించిన గఫూర్ శిక్షక్




కామారెడ్డి, అక్టోబర్ 4: కామారెడ్డి వర్ష బీభత్సం –కవిత్వ సంకలన పుస్తకాన్ని తేదీ 03 అక్టోబర్ శుక్రవారం రోజు కామారెడ్డి లోని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ ఆవిష్కరించారు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ ఇటీవల కామారెడ్డిని అతలాకుతలం చేసిన భారీ వర్షం సృష్టించిన బీభత్సం లో వరద తాకిడికి గురై నష్టపోయిన రైతు కుటుంబాలకు గోసపడిన ప్రజలకు ఈ పుస్తకాన్ని అంకితం చేశామని ప్రజలు పడిన వేదనను భవిష్యత్తులో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచనలుగా ఈ పుస్తకంలో తెలియజేశామని అన్నారు 28 మంది కవులు రాసిన కవితలను ఈ పుస్తకంలో పొందుపరచామని ప్రముఖ కాలమిస్ట్ రచయిత జి లచ్చయ్య అందించిన ముందుమాటలో ఎన్నో సూచనలు ఉన్నాయని వరద వల్ల నష్టపోయిన ప్రజల బాధలను రికార్డు చేశామని అన్నారు సమాజానికి ఆపద వచ్చినప్పుడు కలాలు గా కవులు తోడుంటారని అన్నారు . ఈ సందర్భంగా కామారెడ్డి లో వర్షం సృష్టించిన భీభత్సంలో వరద తాకిడి కి గురై నష్టపోయిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కామారెడ్డిలో ఆక్రమణల కు గురైన నాలాలను కాపాడి పునరుద్ధరించాలని పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టంను నిర్మించాలని కార్యక్రమంలో తీర్మానించారు.

ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా బాధ్యులు మోహన్ రాజ్. గంగా ప్రసాద్ మంద పీతాంబర్ నాగభూషణం రామచంద్రం తిరుపతిరావు సంగ గౌడ్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సభ్యులు పాల్గొన్నారు

# వాహనాల ట్యాక్స్ చెల్లించాలి

**– ఈనెల 6 తేదీ నుండి తనిఖీలు**

**– జిల్లా ఇంచార్జి రవాణా శాఖ అధికారి వంశీదర్**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 4:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో సరుకు, ప్రయాణికులను చేరవేసే వాహనాలకు సంబంధించిన 4,419 గల వాహనాల యజమానులు పన్ను చెల్లించాలని జిల్లా ఇంచార్జి రవాణా శాఖ అధికారి వంశీదర్ ఒక ప్రకటనలో సూచించారు. ఆయా వాహనాలు రోడ్డు టాక్స్ కట్టకుండా వినియోగిస్తున్నారని తెలిపారు సిరిసిల్ల డివిజన్ కు సంబంధించి 2,787 వాహనాలు, వేములవాడ డివిజన్ కి సంబందించి 1,632 వాహనాలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేకుండా జిల్లాలో 11,425 వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. సిరిసిల్ల రెవెన్యూ దివిజన్ లో 6,647, వేములవాడ డివిజన్ లో 4778 ఉన్నట్టు రికార్డ్ లో ఉందని పేర్కొన్నారు. ట్యాక్స్, ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేని వాహనాల యజమానులు ట్యాక్స్ చెల్లించి ఫిట్ నెస్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 6 వ తేదీ సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు బుక్ చేసి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

# అన్‌క్లెయిమ్డ్ సొత్తు రూ.1.84లక్షల కోట్లు : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4:ఎవరూ క్లెయిమ్ చేయకుండా ఉన్న నగదు బ్యాంకులు, నియంత్రణ సంస్థల వద్ద రూ.1.84లక్షల కోట్లు ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సదరు మొత్తం అర్హులకు అందేలా అధికారులు చూడాలన్నారు. కేంద్రమంత్రి గుజరాత్ గాంధీనగర్‌లో మూడులల పాటు జరిగే 'మీ సొమ్ము–మీ హక్కు' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. గుజరాత్ ఆర్థిక మంత్రి కనుభాయ్ దేశాయ్, బ్యాంకులు, ఆర్థిక మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన, ప్రచారం, యాక్షన్ అనే మూడు అంశాలపై పని చేయాలని.. అప్పుడు అన్‌క్లెయిమ్ సొమ్ము సరైన లబ్ధిదారులకు చేరుతాయన్నారు. బ్యాంకు డిపాజిట్లు, బీమా, ప్రావిడెండ్ ఫండ్, షేర్లు తదితర రూపాల్లో బ్యాంకులు, ఇతర నియంత్రణ సంస్థల వద్ద రూ.1.84 లక్షల కోట్ల నిధులు మూలుగుతున్నాయన్న ఆర్థిక మంత్రి.. మొత్తాన్ని మూడునెలల్లో అర్హులకు చేరేలా అధికారులే చొరవ చూపాలన్నారు.

మొత్తం భద్రంగా ఉందని, సరైన పత్రాలు పత్రాలు అందించి నగదును తీసుకోవాలని ఆమె పౌరులకు సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం కస్టోడియన్‌గా వ్యవహరిస్తుందన్నారు. క్లెయిమ్ కాని నిధులు బ్యాంకులు, ఆర్‌బీఐ, ఐఈపీఎఫ్‌లో ఉన్నాయని.. అవసరమైన పత్రాలు సమర్పించిన తర్వాత తిరిగి వాటిని పొందవచ్చన్నారు. దీర్ఘకాలంలో నగదును ఎవరూ క్లెయిమ్ చేయకపోవడంతో ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు బదిలీ అవుతుంటాయన్నారు. బ్యాంకుల నుంచి ఆర్‌బీఐకి, సెబీ నుంచి మరో సంస్థకు ఇలా నగదు మారుతూ ఉంటుందన్నారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల రిజర్వ్ బ్యాంక్ ఉద్గమ్ (ఉఆఉంఓ) పోర్టల్‌ను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. పోర్టల్ ద్వారా పౌరులు నగదును క్లెయిమ్ చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత



బ్యాంకు అధికారులపై ఉందన్నారు. అవసరమైతే బ్యాంకులు గ్రామాల్లో స్టాల్స్ ఏర్పాటు చేయాలని నిర్మలా సీతారామన్ సూచించారు. అయితే, క్లెయిమ్ చేయని బ్యాంక్ డిపాజిట్ల అర్హులను గుర్తించేందుకు ప్రతి గ్రామాన్ని సందర్శిస్తారని గుజరాత్ గ్రామీణ బ్యాంకు తెలుపగా.. బ్యాంకును ఆర్థికమంత్రి ప్రశంసించారు.

# జోరుగా కొనసాగుతున్న కోటమైసమ్మ తల్లి జాతర



ఖమ్మం, అక్టోబర్ 4:ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి జాతర మూడో రోజు శనివారం జోరుగా కొనసాగుతుంది. జాతరకు జన తాకిడి విపరీతంగా పెరిగింది. రాత్రి సమయంలో జాతర చూడటానికి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు వేలాదిగా తరలి వస్తుండడంతో జాతర జనంతో కిక్కిరిసి పోయింది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ బైరు గోపీ ఆధ్వర్యంలో పోలీసులు రేయింబవళ్లు బందోబస్తు నిర్వహిస్తూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూస్తున్నారు. వాహనాలను కోటమైసమ్మ ఆర్చీ వద్దే నిలిపివేసి ట్రాఫిక్‌ను నియంత్రణలో ఉంచారు. వినోద సాధనాల వైపు ప్రజలు మక్కువ చూపిస్తున్నారు.

# బీఆర్ఎస్ నేత మృతి బాధాకరం

**–బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వార్డుకు చెందిన మాజీ గ్రామ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త వేములవాడ (కమ్మరి) మృతిపై సంతాపం వ్యక్తం చేసి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, మనోధైర్యం నింపారు.



శ్రీనివాస్(47) గుండెపోటుతో మృతిచెందగా, వారి భౌతిక కాయానికి శనివారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహా రావుని వాళు లర్పించారు. అనంతరం శ్రీని వాస్ మరణం చెందడం చాలా బాధాకరం అన్నారు. శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. వారి

తదనంతరం ఆయన మాట్లాడుతూశ్రీనివాస్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అంటే ప్రాణమని శ్రీనివాస్ చెప్పేవాడని, గుండెపోటుతో అకాల వెంట జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, నాయకులు నీలం శేఖర్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, జోగిని శంకర్ తదితరులు ఉన్నారు.

# ప్రియుడితో పారిపోయిన భార్య.. పిల్లలతో కలిసి నదిలో దూకిన భర్త

లక్నో, అక్టోబర్ 4: ఒక మహిళ తన ప్రియుడితో కలిసి పారిపోయింది. ఇది తెలిసిన ఆమె భర్త నలుగురు పిల్లలతో కలిసి నదిలోకి దూకాడు. ఆత్మహత్యకు ముందు అతడు రికార్డ్ చేసిన వీడియోను సోదరికి పంపాడు. ఇది తెలుసుకున్న పోలీసులు వారి కోసం ఆ నదిలో గాలిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో ఈ సంఘటన జరిగింది. సల్మాన్, ఖుష్నుమా దంపతులకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. నలుగురు పిల్లలైన 12 ఏళ్ల మహక్, ఐదేళ్ల షిఫా మూడేళ్ల అమన్, ఎనిమిది నెలల శిశువు ఇనైషా ఉన్నారు.

కాగా, ఖుష్నుమాకు ప్రియుడు ఉన్నట్లు తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 3న సల్మాన్, ఖుష్నుమా మధ్య పెద్ద గొడవ జరిగింది. ఆగ్రహించిన ఖుష్నుమా ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన ప్రియుడితో కలిసి పారిపోయింది.

మరోవైపు ఈ విషయం తెలుసుకున్న సల్మాన్ తన నలుగురు పిల్లలను తీసుకుని యమునా నది బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడే ముందు వీడియో రికార్డ్ చేశాడు. తమ చావుకు భార్య, ఆమె ప్రియుడు కారణమని ఆరోపించాడు. ఈ వీడియోను సోదరికి పంపాడు. ఆ తర్వాత నలుగురు పిల్లలతో కలిసి యమునా నదిలోకి దూకాడు.

కాగా, ఈ వీడియో చూసిన సల్మాన్ సోదరి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు యమునా నది వద్దకు చేరుకున్నారు. సల్మాన్, అతడి పిల్లల కోసం గజ ఈతగాళ్లతో ఆ నదిలో గాలిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీశైలం దేవస్థానానికి సూర్య కన్ స్ట్రక్షన్స్ కంపెనీ మినీ బస్ విరాళం

శ్రీశైలంఅక్టోబర్ 4: శ్రీశైలం దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం విజయవాడకు చెందిన సూర్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మినీ బస్సును విరాళంగా అందజేసింది. రూ.23 లక్షల విలువైన ఈ బస్సులో 25 సీట్ల




సామర్థ్యం కలదు. ఈ బస్సును ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్ నివాసంలో ఆయన చేతుల మీదుగా వాహన తాళాలను దేవస్థానం అధికారులకు అప్పగించారు.

ఈ కార్యక్రమంలో సూర్య కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావుతో పాటు 20 ళ్లసూత్రాల కమిటీ మాజీ చైర్మన్ వై.సాయిబాబు, శ్రీశైలం దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఎ.ఇ.ఎ) కె.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఆర్.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులకు గురైతే షీటీమ్‌ను సంప్రదించాలి

**–జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 4:(నేటినిజం ప్రతినిధి): మహిళలు, విద్యార్థినిలు వేధింపులకు గురైతేషీటీమ్ ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో యాక్ట్/లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.



మహిళలను వేధిస్తున్న పోకిరీలపై గత నెలలో 04 కేసులు ,03 పెట్టి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మహిళలు,విద్యార్థినిలు వేధింపులకు గురైతే షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థినులు,మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

గత నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 04 ఎఫ్ ఐ ఆర్ లు, 03 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారియొక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు .విద్యాసంస్థలల్లో ఎవరైనా వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# ఎన్నికల నియమాల ప్రకారం అనుసరించాలి...ఎంపీడీవో వేణుమాధవ్



మహబూబాబాద్, అక్టోబర్ 4:మహబూబాబాద్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పెద్దవంగర మండలంలోని రైతు వేదిక నందు ఈరోజు ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ ఎన్నికల నియమాలు,వారు అనుసరం చాల్సిన విధి విధానాల గురించి వివిధ పార్టీల నాయకులకు మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ లస్కర్, వివిధ పార్టీల అధ్యక్షులు,నాయకులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఒకే దేవుడు ఒకే దేశం నినాదంతో..

# అమృత మంజరీ 2వ భాగం పుస్తక ఆవిష్కరణ



మెదక్, అక్టోబర్ 4: మెదక్ జిల్లా కేంద్రంలోని న్యూ భారత్ ఫంక్షన్ హాల్ నందు అమృత మంజరీ.. అంకురం 2వ భాగం ఆధ్యాత్మిక పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా ఇంచార్జ్ రవీందర్ తెలిపారు.

శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకే దేవుడు ఒకే దేశం సిద్ధాంతాన్ని భారతదేశం వ్యాప్తంగా చాటి చెబుతూ దేశ ప్రగతికి రాష్ట్ర అభివృద్ధికి, దేశ ప్రజలందరికీ భగవంతుని ఆశీస్సులు ఉండాలని తెలంగాణ రాష్ట్రంలో మను జ్యోతి ఆశ్రమం నుండి అనేకమంది ప్రేమికులు జాతి, మత, కుల భేదాలు లేకుండా పాల్గొంటున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా మన జ్యోతి ఆశ్రమం స్థాపకులు శ్రీమన్నారాయణ లహరి కృష్ణ చేతుల మీదుగా అమృత మంజరీ 2 భాగం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ శంకర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల శేషారెడ్డి , ఆధ్యాత్మిక అడ్వకేట్ బోయిన్ శ్రీనివాస్ అనేకమంది ఆధ్యాత్మిక ప్రేమికులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మల్లయ్య, సాయిలు,మల్లయ్య, విజయ్ కుమార్, రమేష్ కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో ఆల్-రేంజ్ వెహికిల్ డీలర్షిప్ ప్రారంభం




హైదరాబాద్, అక్టోబర్ 4:ఎక మొబిలిటీ, ప్రముఖ భారతీయ ఎలక్ట్రిక్ వెహికల్ మొబిలిటీ సొల్యూషన్స్ కంపెనీ, విజయవాడలో ఆర్ ఆర్ తన సరికొత్త ఆల్-రేంజ్ వెహికల్ డీలర్షిప్ను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్లో తన పరిధిని విస్తరించింది. విజయవాడలోని గుణదలలో, ఎన్టిఆర్ హెల్త్ యూనివర్శిటీ సర్వీస్ రోడ్డులో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన 48-10-21/2బి వద్ద గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న ఎక షోరూమ్ వ్యూహాత్మకంగా యెన్ హెచ్ 16 పై స్థాపించబడింది, గుంటూరు, విశాఖపట్నం తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సజావు కనెక్టివిటీని అందిస్తుంది.సమగ్ర 3ఎస్ ఫెసిలిటీ (అమ్మకాలు, సేవ విడిభాగాలు)గా స్థాపించబడిన ఈ డీలర్షిప్, కస్టమర్లు ఎక యొక్క ఎలక్ట్రిక్ వాహనాలను నిపుణుల మార్గదర్శకత్వంతో అనుభవించి కొనుగోలు చేయగల సమగ్ర కస్టమర్ అనుభవాన్ని అందిస్తుంది, అదే సమయంలో నిబద్ధతతో కూడిన సర్వీసు మరియు నిజమైన విడిభాగాల మద్దతును కూడా పొందవచ్చు. 3,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ డీలర్షిప్, ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కులు మరియు చిన్న వాణిజ్య వాహనాలతో సహ భారతదేశపు అతిపెద్ద శ్రేణి ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలను ప్రదర్శిస్తుంది, ఇందులో ఎక ఏడుటి, 55 టి ఎలక్ట్రిక్ ట్రక్కులు, ఎక 7 ఎం,9ఎం ఉ 12ఎం,ఎలక్ట్రిక్ బస్సులు, లో-ఫ్లోర్ బస్సులు, కోచ్లు, 3 డబ్ల్యూ ఎలక్ట్రిక్ కార్గో వాహనాలు, ఎక 3 ఎస్ ? రోజువారీ రాకపోకలకు మరియు సిటీ రైడ్ల కోసం 3 సీట్ల ప్యాసింజర్ ఈ వి , మరియు ఎక 6ఎస్ ? స్టీరింగ్ సౌకర్యంతో భారతదేశపు మొట్టమొదటి ఎలక్ట్రిక్ 3-వీలర్ ప్యాసింజర్ వాహనాలు ఉన్నాయి. ఈ ఆవిష్కరణ సందర్భంగా వ్యాఖ్యానిస్తూ, మిస్టర్. రోహిత్ శ్రీవాస్తవ, బిజినెస్ హెడ్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్, ఈకేఏ మొబిలిటీ ఇలా అన్నారు, "విజయవాడ ఆంధ్రప్రదేశ్లో ఒక కీలక వాణిజ్య ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ఆర్ ఆర్ మొబిలిటీని ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు ఒకే పైకప్పు క్రింద పూర్తి ఈ వి అనుభవాన్ని అందించగలిగే అవకాశాన్ని సృష్టించాము. స్థానిక వ్యాపారాలు నివాసితులకు పర్యావరణ అనుకూలమైన, నమ్మకమైన, ఆర్థికంగా అందుబాటులో ఉన్న వాహనాలను అందించడం మా లక్ష్యం,'' అని చెప్పారు. ''ఎక మొబిలిటీతో మా భాగస్వామ్యం ఆవిష్కరణ, విశ్వాసం కస్టమర్-ఫస్ట్ సర్వీస్పై ఆధారపడింది. కలిసి, ఆంధ్రప్రదేశ్లో వాణిజ్య మొబిలిటీ భవిష్యత్తును పునఃనిర్వచించడానికి మేము లక్ష్యంగా పెట్టుకున్నాం" అని మిస్టర్. ముప్పల్లా రోహిత్, మేనేజింగ్ డైరెక్టర్, ఆర్ఆర్ మొబిలిటీ అన్నారు. విజయవాడతో పాటు, కంపెనీ మహారాష్ట్రలోని ముంబైలో కొత్త డీలర్షిప్ను కూడా ప్రారంభించింది,

# స్థానిక ఎన్నికలపై బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ఎన్నికల ప్రభారిగా బిజెపి రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై, అర్బన్ మండలంలోని అన్ని గ్రామాలలో వార్డు నుండి జెడ్పిటిసి వరకు బిజెపి అభ్యర్థులు బరిలో ఉంటారని, ప్రజలందరూ కూడా బిజెపి వైపు చూస్తున్నారని అన్నారు. పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కరీంనగర్ పార్లమెంటు పరిధిలో వేములవాడ అర్బన్ మండలంలో స్థానిక సంస్థలలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వరరావు, నాయకులు జింక అనిల్, రేగుల పరశురాం, సురువు వెంకట్ ,చంద్రగిరి ప్రశాంత్ నర్సింగ్ రోజు శంకర్, గోనే భాస్కర్ ,సంతోష్ యాదవ్, చల్ల నరసయ్య, ఎరుగోక్కుల రమేష్, సంజీవరెడ్డి, ఎర్రం లక్ష్మీనర్సు, ఎడ్ల హరీష్ దామోదర్ రెడ్డి, వేముల నాగరాజు, లక్ష్మారెడ్డి, బియ్యాల మధురావు, ముధం శ్రీనివాస్ పేరంగాని మల్లేశం, అంజన్న యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com